Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 226 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 5 సెప్టెంబర్ 2023 | మంగళవారం | పేజీలు : 4

### సోనియా అధ్యక్షతన కాంగ్రెస్ స్ట్రాటజీ గ్రూప్ సమావేశం

న్యూఢిల్లీ: పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కాంగ్రెస్ పార్లమెంటరీ స్ట్రాటజీ గ్రూప్ మంగళవారంనాడు సమావేశం కానుంది. దీనికి ఆ పార్టీ పార్లమెంటరీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ అధ్యక్షత వహించనున్నారు. ఇదే విషయమై చర్చించేందుకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తన నివాసంలో 'ఇండియా' కూటమి ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేశారు.

**ఐదురోజుల పాటు ప్రత్యేక సమావేశాలు :** ఐదు సిట్టింగ్‌లతో ఈ నెల 18 నుంచి 22 వరకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలకు ప్రభు త్వం పిలుపునిచ్చింది. ఈమేరకు ఉభయసభల సెక్రటేరియట్‌లు నోటిఫి కేషన్లు ఇచ్చాయి. ఈ ప్రత్యేక సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయం, ప్రైవేటు మెంబర్స్ బిజినెస్ వంటివి ఉండవు.

ఏడవ లోక్‌సభ 13వ సమావేశం ఐదు రోజులు జరుగుతుందని లోక్‌సభ సెక్రటేరియట్, రాజ్యసభ 261వ సమావేశాలు ఐదు రోజులు (18-22) జరుగుతా యని రాజ్యసభ సెక్రటేరియట్ ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్నాయి.




# వన్ నేషన్.. వన్ ఎలక్షన్..

## ఇది సాధ్యమేనా...1?

ఇంతకాలం రాజకీయ వర్గాల చర్చల్లో మాత్రమే వినిపించే జమిలి ఎన్నికలకు సంబంధించి మోడీ నాయకత్వంలోని కేంద్ర సర్కారు అనూహ్యంగా తెర మీదకు తీసుకురావటం తెలిసిందే. దీంతో.. ఇప్పుడు చర్చ మొత్తం జమిలి చుట్టూనే జరుగుతోంది. మోడీ సర్కారు అనుకున్నట్లుగా జమిలి ఎన్నికల్ని త్వరలో నిర్వహించే వీలుందా? అంటే.. లేదనే మాట బలంగా వినిపిస్తోంది. ఎందుకంటే.. ఇంత పెద్ద దేశంలో ఒకేసారి లోక్ సభ ఎన్నికలతో పాటు 28 రాష్ట్రాల్లో (అన్ని కాకున్నా వీలైనన్ని ఎక్కువ రాష్ట్రాల్లో) ఎన్నికల్ని ఒకే దఫా నిర్వహించటం అంటే అంత మామూలు విషయం కాదు. ఒకవేళ.. అన్ని రాష్ట్రాలు కాకున్నా.. మెజార్టీ రాష్ట్రాలు అనుకున్నా.. అదెంత తేలికైన విషయం కాదు. ఇదే విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘంలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన వారు మోడీ సర్కారు నిర్ణయంపై కీలక వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇంతకూ వారేం చెబుతున్నారు? అన్న విషయంలోకి వెళితే..ఒకే దేశం.. ఒకే ఎన్నికలు మాట వినేందుకు బాగానే ఉన్నా.. ఆచరణలో అంత తేలికైన విషయం కాదంటున్నారు. ఒకేసారి ఎన్నికలకు సిద్ధం కావాలంటే కనీసం ఒకట్రెండు సంవత్సరాల ప్రణాళిక.. కార్యాచరణ ఉండాలని చెబుతున్నారు. గతంలోనూ ఒకేసారి ఎన్నికల్ని నిర్వహించే సామర్థ్యం ఉన్నా.. ప్రాక్టికల్ ప్రాబ్లమ్స్ ఎక్కువని గుర్తు చేస్తున్నారు. 1952-1967 మధ్యలో పెద్ద టెక్నాలజీ అందుబాటులో లేకున్నా దేశం మొత్తానికి ఒకేసారి ఎన్నికల్ని నిర్వహించిన ట్రాక్ రికార్డు ఉందన్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. కాకుంటే.. ఇప్పుడున్న పరిస్థితుల్లో కొన్ని ఇబ్బందులు ఎదురవొచ్చని చెబుతున్నారు. అన్నింటికి మించి ఇప్పటికిప్పుడు మూడు నాలుగు నెలల్లో ఎన్నికల్ని నిర్వహించటం సాధ్యం కాదని.. దానికి కనీసం ఒక ఏడాది నుంచి వర్కువుట్ చేస్తే కానీ జమిలి ఎన్నికల్ని నిర్వహించే వీలుంది. గతంలో అన్ని ఎన్నికలు ఒకేసారి జరిగేవి. తర్వాతి కాలంలో ఆయా రాష్ట్రాల్లో చోటు చేసుకునే పరిణామాలు.. కేంద్రంలోని ప్రభుత్వ బలాబలాలు మారటంతో ఆ షెడ్యూల్ గాడి తప్పింది. దీంతో.. ప్రతి ఏడాది ఎన్నికల మీద ఎన్నికలు రావటంతో.. కేంద్రం పాలన మీద కంటే రాజకీయ అంశాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సి వస్తోంది. దీంతో.. తిరిగి జమిలి ఎన్నికల దిశగా అడుగులు వేయాలని ప్రధాని మోడీ భావిస్తున్నారు. అయితే.. ఒకేసారి ఎన్నికల్ని నిర్వహించేందుకు అన్ని పార్టీల మద్దతు అవసరం. దీంతో పాటు రాజ్యాంగానికి.. ప్రజాప్రాతినిధ్య చట్టానికి సవరణలు చేయాలి. వీటితో పాటు భారీ స్థాయిలో కేంద్ర పోలీసు బలగాలు.. ఈవీఎంలు.. వీవీ ప్యాట్లు అవసరం అవుతాయి. వాటి తయారీకి భారీగా నిధులు అవసరమవుతాయి. ఇవన్నీ చేసేందుకు కనీసం ఏడాది నుంచి రెండేళ్లు అవసరమవుతాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో దేశ వ్యాప్తంగా 25 లక్షల లోపు ఈవీఎంలు ఉన్నాయి. కానీ.. ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలంటే కనీసం 40 లక్షల ఈవీఎంలు అవసరం అవుతాయి. మరి.. అన్ని తయారు చేయించాలంటే భారీ బడ్జెట్ అవసరపడుతుంది. ఇలా ప్రాక్టికల్ ప్రాబ్లమ్స్ ఉన్న నేపథ్యంలో జమిలి ఎన్నికలు ఇప్పటికిప్పుడు సాధ్యం కాదంటున్నారు. లేదంటే.. మిని జమిలి ఎన్నికలు జరిపి.. ఎన్నికలు నిర్వహించని రాష్ట్రాలను ఏకం చేసి.. వాటికి సపరేటుగా ఎన్నికలు నిర్వహించేలా చేయాల్సి ఉంటుంది. కానీ.. ఆ ప్రక్రియకు రాజకీయ పార్టీలు సానుకూలంగా స్పందిస్తాయా? అన్నది మరో ప్రశ్న. మొత్తంగా ఒక దేశం.. ఒక ఎన్నిక అన్న నినాదం.. మాట చెప్పినంత ఈజీ కాదని మాత్రం చెప్పక తప్పదు.




# భారమంతా డీకే పైనే

## తెలివిగా ఆయనను రంగంలోకి దింపుతున్న రేవంత్!


హైదరాబాద్ : తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావాలని కృతనిశ్చయంతో ఉంది.. కాంగ్రెస్ పార్టీ. పొరుగు రాష్ట్రం కర్ణాటకలో ఈ ఏడాది మే నెలలో అధికారంలోకి రావడంతో అదే మ్యాజిక్కును తెలంగాణలోనూ కొనసాగించాలనే లక్ష్యంతో ఆ పార్టీ ఉంది. ఈ నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నేతృత్వంలో వివిధ పార్టీల నుంచి భారీ ఎత్తున కీలక నేతలు కాంగ్రెస్ లో చేరుతున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ నేతలు మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీజేపీ నేత, మాజీ మంత్రి చంద్రశేఖర్ వంటివారు కాంగ్రెస్ లో చేరిపోయారు. అలాగే మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కూడా కాంగ్రెస్ లో చేరతారని టాక్ నడుస్తోంది. మరోవైపు వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి టికెట్ కోసం దరఖాస్తులు ఆహ్వానించగా 119 అసెంబ్లీ స్థానాలకు ఏకంగా 1,000కి పైగా దరఖాస్తులు వచ్చాయి. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డితో సహా కీలక నేతలంతా టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు ఆ దరఖాస్తుల పరిశీలన జరుగుతోంది. వడపోతల అనంతరం ఫైనల్ గా అభ్యర్థులను ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో రేవంత్.. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, ఆ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ సాయాన్ని కోరారని తెలుస్తోంది. తాజాగా బెంగళూరు వెళ్లిన రేవంత్.. డీకే శివకుమార్ తో భేటీ అయ్యారు. డీకేకు ట్రబుల్ షూటర్ గా కాంగ్రెస్ పార్టీలో పేరుంది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో పీసీసీ అధ్యక్షుడిగా కీలక పాత్ర డీకే శివకుమార్ దే. ఈ నేపథ్యంలో కొన్నాళ్లపాటు డీకేను రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో ఉండాలని కోరినట్టు ప్రచారం జరుగుతోంది. హైదరాబాద్ లో ఉండి అసెంబ్లీ టికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలని విన్నవించినట్టు తెలుస్తోంది. టికెట్ల కోసం భారీ ఎత్తున కాంగ్రెస్ నేతలు దరఖాస్తు చేసుకోవడం, కొన్ని చోట్ల కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు కూడా దరఖాస్తు చేసిన నేపథ్యంలో రేవంత్ రెడ్డిపై అనేక ఒత్తిళ్లు, బెదిరింపులు ఉన్నట్టు సమాచారం. సీట్లు రానివారు చివరకు రేవంత్ ను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా సీనియర్ నేతల నుంచి విమర్శలు తప్పకపోవు. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా రేవంత్ రెడ్డి.. డీకే శివకుమార్ ను రంగంలోకి దించుతున్నట్టు టాక్ నడుస్తోంది. అసెంబ్లీ టికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించడంతోపాటు అభ్యర్థులను ఫైనల్ చేయాలని డీకేని కోరినట్టు చెబుతున్నారు. డీకే శివకుమార్ పై కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీలతోపాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలకు మంచి నమ్మకం ఉంది. ఈ నేపథ్యంలో డీకే అభ్యర్థులను ఫైనల్ చేస్తే తెలంగాణ కాంగ్రెస్ నేతలెవరూ అభ్యంతరాలు వ్యక్తం చేయడానికి ముందుకు రారని.. ఒకవేళ కాంగ్రెస్ అధిష్టానానికి ఫిర్యాదు చేసినా డీకే శివకుమారే ఫైనల్ చేశారు కాబట్టి కాంగ్రెస్ అగ్ర నేతల నుంచి పెద్దగా అభ్యంతరాలు ఉండబోవనేది రేవంత్ అభిప్రాయమని అంటున్నారు. అందువల్లే డీకే శివకుమార్ ను రేవంత్ రెడ్డి హైదరాబాద్ కు ఆహ్వానించారని అంటున్నారు. అసెంబ్లీ టికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. అభ్యర్థులను ఫైనల్ చేయాలని కోరినట్టు చెబుతున్నారు.

### హ్యాట్రిక్ మాత్రం బీఆర్ఎస్‌దే : మంత్రి హరీశ రావు

జనగామ : కొంత మంది డిక్లరేషన్ అంటూ నాటకాలకు తెరలేపుతున్నారు. కానీ ప్రజలు మాత్రం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేయాలని సెల్ఫ్ డిక్లరేషన్ చేశారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. పాలకుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, ఇంద్రకరణ్ రెడ్డి, సత్యవతి రాథోడ్‌తో కలిసి నిర్వహించిన ప్రెస్ మీట్‌లో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వికలాంగులకు 4 వేల రూపాయల పెన్షన్ ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కింది. మేము అభివృద్ధి చేసి ఓట్లు అడుగుతున్నాం, ఇతరులు అబద్ధాలు చెప్పి ఓట్లు అడుగుతున్నారని స్పష్టం చేశారు. కేసీఆర్ మూడోసారి గెలిస్తే అభివృద్ధి కొనసాగుతుంది. ఇతరులు గెలిస్తే అభివృద్ధికి కుంటు పడుతదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 24 గంటలు వస్తున్న కరెంటు.. వేరే ప్రభుత్వం వస్తే కరెంట్ వచ్చే పరిస్థితి లేదని పేర్కొన్నారు. 75 వేల కోట్ల రైతుబంధు ఇచ్చిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం అని అలాగే రైతు రుణమాఫీ చేస్తున్న ఘనత కూడా ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎవరెన్ని ట్రిక్కులు చేసినా హ్యాట్రిక్ మాత్రం బీఆర్ఎస్‌దేనని తేల్చి చెప్పారు. బీజేపీ జమిలి పేరుతో ఎన్నికల డ్రామాలు ఆడుతున్నది. బీజేపీ ఎన్ని జెమిలీలు తెచ్చినా జంబ్లింగ్‌లు చేసినా బీఆర్ఎస్ విజయం మాత్రం ఖాయమన్నారు. దక్షిణభారతంపై బీజేపీ చూస్తున్న చిన్న చూపుకు తగిన రీతిలో.. ఈ ప్రాంత ప్రజలు బీజేపీకి తగిన గుణపాఠం చెప్తారన్నారు. బీఆర్ఎస్ రాష్ట్రంలో, దేశంలో కూడా కీలకపాత్ర పోషిస్తుంది. అధికారం ఉన్న రాష్ట్రాల్లో అభివృద్ధి చేయకుండా, అధికారం లేని రాష్ట్రాల్లో ఎలా చేస్తారని ప్రతిపక్షాలను ప్రశ్నించారు. ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో పాలకుర్తి ఎంతో అభివృద్ధి చెందిందన్నారు.

# అలకబూనిన... 'కేటీఆర్ బ్యాచ్'

జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పుడు మిస్ అయితే మరో ఐదేళ్ల వరకు అతీగతీ ఉండదని.. అప్పుడు పరిస్థితి ఏమిటో? అన్న ప్రశ్నతో పాటు.. ఈసారే ఎందుకు తమ కలను తీర్చుకోకూడదన్న పట్టుదల పెరుగుతోంది. దీంతో.. టికెట్ ఆశావాహుల పంచాయితీలు ఎక్కువ అవుతున్నాయి. ఇప్పటివరకు వెలుగు చూసిన ఉదంతాల్ని చూస్తే.. వాటిల్లో ఎక్కువ కేటీఆర్ వర్గానికి చెందిన నేతల నుంచే కావటం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మల్కాజిగిరి ఎపిసోడ్ లో మైనంపల్లి కావొచ్చు.. కుత్బుల్లాపూర్ విషయంలో శంభీపూర్ కావొచ్చు.. పటాన్ చెర్వుతో సహా పలు నియోజకవర్గాల్లో అసమ్మతి రాగం భారీగా వినిపించే చోట.. నిరసనల గొంతును పెంచేసి వినిపిస్తున్న వారంతా కేటీఆర్ కు అత్యంత సన్నిహితులు కావటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కంటోన్మెంట్ లాంటి స్థానంలో కేటీఆర్ కు సన్నిహితంగా



## బిఆర్ఎస్‌లో నివురుగప్పిన నిప్పులా అసంతృప్తి! - తలపట్టుకుంటున్న 'పెద్ద బాస్'

హైదరాబాద్ : కందకు లేని దురద కత్తిపీటకు ఎందున్న సామెతకు తగ్గట్లుగా పరిస్థితులు మారాయి. తన వర్గ ప్రయోజనాల్ని చూసుకోవాల్సిన బాధ్యత ఆ వర్గానికి నాయకత్వం వహించే వారు చూసుకోవాలి. తనను నమ్ముకున్న వారికి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన అవసరం ఉంటుంది. అదే సమయంలో.. తమకు అండగా నిలిచే నాయకుడికి అనవసరమైన తలనొప్పులు తీసుకురాకూడదన్న జాగ్రత్త సదరు నేతను ఫాలో అయ్యే వారికి ఉండాలి. ఈ విషయంలో గులాబీ పార్టీలో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి. ఊరికి ముందే.. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను డిసైడ్ చేసేసి.. ఎన్నికల ప్రచారానికి దిగిపోవాలంటూ గులాబీ బాస్ మార్గదర్శనం చేయటం వరకు బాగానే ఉన్నా.. కొత్త తలనొప్పులతో ఇప్పుడా పార్టీ కిందా మీదా పడుతోంది. సిట్టింగ్ లో వేళ్ల మీద లెక్క పెట్టే స్థానాల్లో మాత్రమే అభ్యర్థుల్ని మార్చిన కేసీఆర్.. సిట్టింగుల్లో 95 శాతం వరకు సీట్లను కట్టబెట్టేయటం తెలిసిందే. ఇప్పటికే రెండు దఫాలుగా టికెట్లు దక్కని నేతలకు ఈసారి టికెట్లు రాకపోవటాన్ని ఉండే క్రిశాంక్ కు సైతం టికెట్ దక్కకపోవటంపై మంత్రి కేటీఆర్ స్వయంగా ట్వీట్ పోస్టు చేసి అర్థం చేసుకోవాలంటూ అనునయించాల్సిన పరిస్థితి. ఇలా పైకి మాట్లాడలేక.. అంతర్గతంగా బుజ్జగించే వారిలో పలువురు.. మంత్రి కేటీఆర్ మాటకు సరేనని చెప్పి.. కొద్ది రోజులు ఆగినంతనే తమ ప్రయత్నాలు తాము చేయటం గులాబీ పార్టీకి ఇప్పుడు కొత్త కష్టంగా మారింది. తన తండ్రి కమ్ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకునే నిర్ణయాలు ఏవైనా.. మధ్యలో అడ్డుకొని చర్చ జరిపి.. తాను అనుకున్న వారికి మాత్రం టికెట్లు ఇప్పించుకునే చొరవ మంత్రి కేటీఆర్ చేయరన్న విషయం పలువురికి తెలీదు. రాజకీయంగా తన తండ్రి తీసుకునే నిర్ణయాన్ని అంగీకరించక తప్పని పరిస్థితి. ఆయన మాట మీదా.. నిర్ణయం మీదా కేటీఆర్ కు ఎంతో గురి. దీనికి తోడు తండ్రి కేసీఆర్ అంటే విపరీతమైన భయం భక్తి. ఇలాంటి వేళలో.. తండ్రి మాటకు ఎదురు చెప్పలేని పరిస్థితి కేటీఆర్ ది. అదే సమయంలో.. తనను నమ్ముకున్న వారికి అనుగుణంగా టికెట్లు ఇప్పించలేని సంకట స్థితి. ఇలాంటి సమయంలో మంత్రి కేటీఆర్ కాస్త సెటిల్డ్ గా ఉన్నప్పటికీ.. నేతలు పలువురు మాత్రంతమకు మంత్రి సన్నిహితంగా ఉన్నారన్న విషయాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. తమకున్నఅసమ్మతిని తమ చేతలతో చూపిస్తున్నారు. దీంతో.. గులాబీ తోటలో ఇప్పుడు అయోమయ పరిస్థితి నెలకొంది. ఈ ధిక్కార స్వరాలకు చెక్ పెట్టకుంటే రానున్న రోజుల్లో మరింత పెరుగుతాయని చెబుతున్నారు. మంత్రి కేటీఆర్ సైతం తన వర్గీయులకు స్పీడ్ కు బ్రేకులు వేయాల్సిన అవసరం ఉందంటున్నారు. ఈ విషయంలో ఏం తేడా జరిగినాపార్టీకే నష్టమన్నది నిజం. ఈ విషయాన్ని వదిలేసి.. తమ స్వార్థం కోసం చేసే ప్రయత్నాలను మంత్రి కేటీఆర్ ఖండించకుంటే ఇబ్బందులు తప్పవని చెప్పకతప్పదు. మరేం చేస్తారో చూడాలి.

# సంపాదకీయం

## లద్దాఖ్ పై లొల్లి.. అరుణాచల్ పై పేచీ..

# చైనా దొంగాట

''హిందీ చీనీ బాయి బాయి..'' అంటే వెన్నుపోటు పొడిచింది.. కొవిడ్ కు కారణమని ప్రపంచం అంతా నిందిస్తుంటే లద్దాఖ్ లో కాలుదువ్వి సమస్యను పక్కదారి పట్టించాలని చూసింది.. తరచూ అరుణాచల్ మాదేనంటూ పేచీకి దిగుతోంది. ఇదంతా జగడాల మారి చైనా గురించి.. అసలు చైనా అంటేనే పేచీకోరు. దాని పక్కన ఏ దేశం ఉన్నా ఆక్రమణ బారినపడాల్సిందే. అది భారత్ వంటి పెద్ద దేశమైనా.. భూటాన్ వంటి బుల్లి దేశమైనా..? చైనా డ్రాగన్ కోరలు ఎక్కడివరకు విస్తరించాయంటే.. పాకిస్థాన్ శ్రీలంక వరకు పాకాయి.

**నెహ్రూకు మనో వ్యథ మిగిల్చి..** భారత తొలి ప్రధాని నెహ్రూకు తీవ్ర మనో వ్యథ మిగిల్చి ఆయన మరణానికి కారణమైన దేశం చైనా. హిందీ చీనీ బాయి బాయి అని నినాదం ఇచ్చిన నెహ్రూ.. అదే సోదర దేశం ఆక్రమణకు దిగడాన్ని, దాని చేతిలో యుద్ధంలో ఓడడాన్ని తట్టుకోలేకపోయారు. 60 ఏళ్ల కిందటే దాని బుద్ధి బయటపడింది.

**మళ్లీ ఇప్పుడు :** దాదాపు 70 ఏళ్ల కిందట టిబెట్ బౌద్ధ గురువు దలైలామాకు భారత్ ఆశ్రయం ఇచ్చినందుకు అక్రోశం పెంచుకున్న చైనా లద్దాఖ్ లో యుద్ధానికి దిగి అక్సాయ్ చిన్ ను ఆక్రమించింది. ఇప్పుడు జి-20 వంటి శిఖరాగ్ర సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇవ్వనున్న సమయంలో అరుణాచల్ ప్రదేశ్ తమదేనంటూ కయ్యానికి కాలుదువ్వుతోంది.


**చైనాదంతా 'పటా'టోపమే..** వాస్తవానికి ఇప్పుడున్న చైనా భౌగోళిక స్వరూపంలో చాలావరకు ఆక్రమిత ప్రాంతాలతో కూడుకున్నదే. టిబెట్ ఒకనాడు స్వతంత్ర దేశం. అక్సాయ్ చిన్ మన లద్దాఖ్ లోనిది. ఇవే కాదు.. జపాన్, దక్షిణ కొరియా, భూటాన్, నేపాల్, ఫిలిప్పీన్స్ భూమినీ చైనా కబళించిందనే వాదన ఉంది. ఒకప్పుడు సొంత దేశంగా ఉన్న టిబెట్ ను కలిపేసుకుని బౌద్ధ గురువు దలైలామాను బంధించాలని చూసింది. మన అరుణాచల్ ప్రదేశ్ పైనా డ్రాగన్ కన్నేసింది. పేర్లు మార్చి తమ భూభాగం అని చెబుతోంది.

**అరుణాచల్ ఎందుకంటే..?** ఈశాన్య భారతంలో కీలక రాష్ట్రం అరుణాచల్. దీనికి టిబెట్, మయన్మార్, భూటాన్ దేశాలతో సరిహద్దులున్నాయి. అంతేకాదు.. మొత్తం ఏడు ఈశాన్య రాష్ట్రాలకు పెద్ద దిక్కు. చైనా తమది అని ప్రకటించే తైవాన్ భూభాగానికి అరుణాచల్ మూడు రెట్లు పెద్దది. అందుకనే దక్షిణ టిబెట్ అని పేర్కొంటూ తమ భాష మాండరిన్ లో జంగ్నామ్ అని పేరు పెటింది. వాస్తవానికి మొత్తం అరుణాచల్ కంటే.. తవాంగ్ జిల్లాపైనే చైనా ఎక్కువగా కన్నేసింది. ఆ రాష్ట్రంలో నైరుతి దిక్కునుండే తవాండ్ కు భూటాన్, టిబెట్ తో సరిహద్దులున్నాయి. అంటే భౌగోళికంగా కీలకం. ఈశాన్య భారతంలోకి అడుగుపెట్టడానికి.. టిబెట్ తో పాటు, బ్రహ్మపుత్ర లోయ మధ్యన ఇది కీలకం. అందుకనే అక్కడి గాండెన్ బౌద్ధారామంను చూపించి అరుణాచల్ తమదే అంటోంది. టిబెట్ లోని బౌద్ధారామం తర్వాత తవాంగ్ గాండెన్ అతి పెద్దది. 1680లో దీన్ని ఐదో దలైలామా కోరిక మేరకు నిర్మించారు. టిబెట్ ఆరామానికి, తవాంగ్ కు మధ్య సంబంధాలున్నాయి. అయితే, అసలు టిబెట్టే చైనాది కానప్పుడు అరుణాచల్ లోని తవాంగ్ దానిది ఎలా అవుతుందన్నది ప్రశ్న.

**వాస్తవాధీన రేఖను కాదని..** టిబెట్ ను చైనా 1950లలో కబళించింది. బ్రిటీష్ వారి హయాంలో 1914లోనే భారత్ , టిబెట్, చైనా మధ్య వాస్తవాధీన రేఖ (ఎల్ ఏసీ) నిర్ణయమైంది. దీనిని చైనా ఒప్పుకొంది. కానీ, భారత్ స్వాతంత్ర్యం పొందిన తొలినాళ్లలో అటు చైనాలో 1949లో కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చాక ఎల్ ఏసీని గుర్తించటానికి నిరాకరిస్తోంది. అరుణాచల్ ను తమ పురాతన పట్టణంగా కూడా పేర్కొంటోంది.

**ఆ కసి ఇప్పుడు..?** అణచివేత నేపథ్యంలో దలైలామా 1959లో టిబెట్ మీదుగా తవాంగ్ ద్వారా భారత్ లోకి వచ్చారు. తవాంగ్ లో టిబెట్ బుద్ధిజాన్ని పాటించే వారు తమకు ఎప్పటికైనా ముప్పని చైనా భావిస్తోంది. వీరు ప్రజాస్వామ్య ఉద్యమం ఆరంభిస్తాయన్నది దాని అనుమానం. దీంతోపాటు భారత్ పై ఎప్పుడైనా దాడి చేయాలంటూ అరుణాచల్ ముఖ్యం. ఇప్పటికే ఎగువన అనేక నీటి పారుదల ప్రాజెక్టులు కట్టిన చైనా నీటిని నియంత్రిస్తోంది. దీనికితోడు సైన్యం-తమ పౌరుల మధ్య సమన్వయానికి ల్యాండ్ బోర్డర్ లా పేరిట 2022లో కొత్త చట్టం తీసుకొచ్చింది.

# ఆంగ్లంపై పట్టు నలుగురు మెచ్చేట్టు



ఖమ్మం : వ్యవసాయ కూలీ కుటుంబంలో పుట్టినా.. తెలుగు మాధ్యమంలో చదివినా.. ఆంగ్ల భాషపై పట్టు సాధించారు నారాయణ. నలుగురు మెచ్చేలా బోధిస్తున్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తూ ఆర్థిక తోడ్పాటును అందిస్తున్నారు. బోనకల్లు మండలం ముష్టికుంట్లకు చెందిన కామిశెట్టి వెంకటనారాయణ ప్రస్తుతం ఖమ్మం పాండురంగాపురంలో నివాసముంటున్నారు. పేద కుటుంబంలో పుట్టిన ఆయన తండ్రి వీరస్వామి, తల్లి సత్యవతి వ్యవసాయ కూలీలు. చదువుకునే రోజుల్లో ఆర్థిక ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. వత్సవాయి, బోనకల్లు, లింగాల ప్రాంతాల్లో ముఠామేస్త్రీగా పనులు చేశారు. ఖమ్మం సిద్దారెడ్డి కళాశాలలో డిగ్రీ చదివే రోజుల్లో సాయంత్రం ట్యూషన్లు చెప్పేవారు. ఎంఏ, బీఈడీ చేసిన నారాయణ 15 ఏళ్ల నుంచి ఆంగ్ల భాషోపాధ్యాయుడిగా పలు ప్రైవేటు విద్యా సంస్థల్లో పని చేశారు.

భావ వ్యక్తీకరణ నైపుణ్యాలపై అవగాహన

ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఆంగ్ల బోధన తప్పనిసరి అయింది. ఈ క్రమంలో ప్రైవేటు, గురుకుల పాఠశాలల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు సైతం ఆంగ్లంపై శ్రద్ధ పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే రఘునాథపాలెం బీసీ బాలురు గురుకుల పాఠశాలలో బోధనా సిబ్బందికి కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ఉచితంగా అవగాహన కల్పిస్తున్నారు. వృత్తిపరంగా అభివృద్ధికి, బోధన పటిమకు ఈ నైపుణ్యాలు దోహదపడతాయంటున్నారు. ఆంగ్లభాషలో నారాయణ దగ్గర శిక్షణ పొందిన పలువురు ఖమ్మం ప్రైవేటు విద్యా సంస్థల్లో విధులు నిర్వహిస్తున్నారు.

పేద విద్యార్థులకు చేయూత

ఐఈఎల్‌టీఎస్‌లో (విదేశాల్లో విద్యాభ్యాస ప్రవేశ పరీక్ష) నారాయణ దగ్గర శిక్షణ తీసుకున్నవారు ప్రస్తుతం లండన్, అమెరికా దేశాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నారు. మనదేశంలోని చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. పూర్వ విద్యార్థుల సహకారం, భార్య ఉషాకుమారి(మోడల్ స్కూల్ టీచర్) ప్రోత్సాహంతో పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. చదువుకోవాలన్న ఆకాంక్ష ఉండి, డబ్బులు లేక పడే ఇబ్బందులు ఏమిటో తాను అనుభవించానని, అందుకే ఈ సంకల్పం అంటూాకు తెలిపారు నారాయణ.

# అద్దె భవనం అవస్థలు అధికం!



ఖమ్మం : విద్యావ్యవస్థలో గిరిజన గురుకులాలకు ప్రత్యేక స్థానం ఉన్నప్పటికీ బాలారిష్టాలు తప్పడం లేదు. ఉభయ జిల్లాల్లో ఒకటోతరగతి నుంచి డిగ్రీ వరకు బాలబాలికలకు బోధన సాగిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నా మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. నాలుగు డిగ్రీ కళాశాలలున్నాయి. వీటిలో ఒకటి బాలురకు, మూడు బాలికలకు కేటాయించారు.

శాశ్వత పరిష్కారమేదీ..?

పినపాక నియోజకవర్గంలోని మణుగూరుకు మంజూరైన కళాశాలకు సరిపడా వసతులు లేవన్న కారణంతో దీన్ని కొంతకాలంగా భద్రాచలంలో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. 480 సీట్లకు 348 మంది విద్యార్థులు ఇక్కడ అభ్యసిస్తున్నారు. ఏ ప్రాంతానికి కేటాయించిన కళాశాల అదే ప్రాంతంలో ఉండాలనే నిబంధన తెరపైకి రావటంతో త్వరలో పినపాక నియోజకవర్గం పరిధిలోకి దీన్ని తరలించనున్నారు. అక్కడ సొంత భవనం లేదు. ఖమ్మంలో 920 మందికి అవకాశముండగా 584 మంది విద్యార్థులు చదువుతున్నారు. కొత్తగూడెంలో 840 సీట్లకు 588 మంది అభ్యసిస్తున్నారు. ఈ మూడింటికీ అద్దె భవనాలే దిక్కయ్యాయి. నాలుగైదేళ్ల నుంచి రూ.కోట్లలో అద్దెలు చెల్లిస్తున్నప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు. మరో కళాశాల దమ్మపేటలోని ఆశ్రమ పాఠశాలలో కొనసాగుతోంది. ఇందులో 640 సీట్లకు 369 మంది చదువుతున్నారు.

ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే..

ప్రతి కళాశాలకు బోధన గదులతో పాటు అదే ప్రాంగణంలో విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలి. క్రీడా మైదానం తప్పనిసరి. సిబ్బందికి నివాస సముదాయం నిర్మించాలి. ఇందుకోసం పదెకరాలకు పైగా స్థలాన్ని రెవెన్యూ శాఖ కేటాయించాల్సి ఉంది. నిర్మాణ పనులకు ఒక్కో కళాశాలకు సుమారు రూ.50 కోట్లు అవసరమని అంచనా. చాలీచాలని వసతులతో కూడిన అద్దె భవనాల్లో బోధన సాగటం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వాటి యజమానులు వద్దంటే మరోచోటుకు విద్యాలయాన్ని తరలించాల్సి వస్తోంది. గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.


'ఏకలవ్య'కు మెరుగులు

ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయాల్లో ఆరోతరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బోధిస్తున్నారు. వీటిని అధునాతనంగా తీర్చిదిద్దేందుకు ఐటీడీఏ ఆర్‌సీఓ పూనుకున్నారు. భద్రాద్రి జిల్లాలో ఏడుచోట్ల 1,807 మంది, ఖమ్మం జిల్లాలో ఒకచోట 230 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. కొన్నిచోట్ల భవనాలు ఉండగా ఇంకొన్నిచోట్ల నిర్మాణ పనులు సాగుతున్నాయి. చర్లకు మంజూరైన ఏకలవ్య విద్యాలయాన్ని భద్రాచలంలో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. చర్లలో భవన నిర్మాణం పూర్తయితే అక్కడకు తరలించనున్నారు. మన్యానికి మరో రెండు ఏకలవ్య విద్యాలయాలు మంజూరు కావాల్సి ఉంది.

గిరిజన గురుకుల విద్యాలయాల్లో ప్రతి విద్యార్థి అత్యుత్తమంగా తయారుకావాలనే లక్ష్యంతో బోధన సాగిస్తున్నాం. తగిన మౌలిక వసతులు కల్పిస్తున్నాం. సొంత భవనాలు లేని వాటికి స్థలాలను అన్వేషిస్తున్నాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. కొన్నిచోట్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.డేవిడ్‌రాజ్, ప్రాంతీయ సమన్వయకర్త

# ఆరోగ్య ఉప కేంద్రాలకు మహర్దశ

ఖమ్మం : గ్రామీణ ప్రజలకు వైద్యసేవలను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో 44 ఆరోగ్య ఉప కేంద్రాలకు రూ.8.80 కోట్లతో పక్కా భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న పీహెచ్‌సీలకు త్వరలో సొంత భవనాలు సమకూరనున్నాయి. పల్లెల్లో మెరుగైన ప్రాథమిక వైద్యం అందించేందుకు క్వాలిఫైడ్ వైద్యులను ప్రభుత్వం నియమిస్తోంది. కొత్తగా మంజూరైన 44 ఆరోగ్య ఉప కేంద్రాలకు భవన నిర్మాణ బాధ్యతలను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖకు కలెక్టర్ గౌతమ్ అప్పగించారు.ప్రజల చెంతకు ప్రాథమిక వైద్య సేవలు: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రాథమిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. జిల్లాలోని 21 మండలాల్లో 30 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా వాటి పరిధిలో 224 ఆరోగ్య ఉప కేంద్రాలు ఏర్పాటుచేసింది. ప్రతి 5 వేల జనాభాకు ఒక కేంద్రం ఏర్పాటు చేయాలనే నిబంధనను అనుసరిస్తోంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతంలో 203, పట్టణ ప్రాంతంలో 21 ఆరోగ్య ఉప కేంద్రాలున్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతంలోని 44 అద్దె ఇళ్లలో నిర్వహిస్తుండగా వాటన్నింటికీ పక్కా భవనాల నిర్మాణానికి సర్కారు నిధులు మంజూరు చేసింది. ఒక్కో భవానికి రూ.20 లక్షల చొప్పున కేటాయించింది. 106 పీహెచ్‌సీలను పల్లె దవాఖానాలుగా ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీఎస్సీ నర్సింగ్,




స్టాఫ్‌నర్సులను వైద్యులుగా నియమించింది. ఆరోగ్య ఉప కేంద్రంలో మాత్రం ఏఎన్ఎం, హెచ్ఏ(హెల్త్ అసిస్టెంట్) అందుబాటులో ఉంటారు. ఉప కేంద్రాలకు 44 భవనాల నిర్మాణానికి స్థలాలను అధికారులు గుర్తించారు.

జిల్లాలో 44 ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణాలకు టెండర్ల ప్రక్రియ చేపట్టాం. త్వరలో గుత్తేదారులను ఖరారు చేసి నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. రెండు నెలల్లో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.సుదర్శన్‌రావు, పీఆర్ ఎస్ఈ, ఖమ్మం

# అడుగంటుతున్న జలాశయాలు..

## ఆందోళనలో అన్నదాతలు

జనగామ : జిల్లాలో యాసంగి వరి నాట్లు పూర్తయ్యాయి. మరో రెండు మాసాల పాటు పొలాలకు నిత్యం తడులు అవసరం. జిల్లాలో దేవాదుల ఎత్తిపోతల పథకంలో నిర్మించిన జలాశయాలు అడుగంటుతున్నాయి. భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయి. ఊట, గొట్టపు బావులను రోజు విడిచి రోజు వినియోగించాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో జిల్లాలోని భారీ, చిన్న నీటి జలాశయాలే దిక్కు. దేవాదుల జలాశయాల్లో నీరు నిండుకుంటోంది. మరో పక్షం రోజుల్లో ధర్మసాగర్ నుంచి నీటి సరఫరా జరగని పక్షంలో ఇవి పూర్తిగా అడుగంటే పరిస్థితలు ఉన్నాయి.

ధర్మసాగర్ నుంచి సరఫరా ఎప్పుడో..

దేవాదుల ఎత్తిపోతల పథకం రెండో దశలో ఆర్ఎస్.ఘన్‌పూర్, అశ్వరావుపల్లి, చీటకోడూరు, గండిరామవరం, బొమ్మకూరు, వెల్దండ, తపాస్‌పల్లి జలాశయాలను నిర్మించారు. మూడో దశలో నష్కల్, పాలకుర్తి, చెన్నూరు, జఫర్‌గఢ్, నవాబ్‌పేట, జనగామ నియోజకవర్గంలోని లద్నూరు, కన్నెబోయినగూడెం, మారెడ్డి చెరువులను అభివృద్ధి చేశారు. ధర్మసాగర్ నుంచి ఆర్ఎస్ ఘన్‌పూర్, అశ్వరావుపల్లి, గండి



రామవరం, బొమ్మకూరు తదితర జలాశయాలకు నీరు సరఫరా కావాల్సి ఉంటుంది. ధర్మసాగర్‌కు వచ్చే పైపులైన్ పులుకుర్తి, చలివాగు తదితర ప్రాంతాల్లో గత వర్షాకాలం పలు చోట్ల పైకి తేలడంతో ఎత్తిపోతలు నిలిచి పోయింది. ఏడాదిలో 170 రోజులు ఎత్తిపోతలు జరగాల్సి ఉంటుంది. సాంకేతిక కారణాలతో ఎత్తిపోతల్లో అంతరాయం ఏర్పడింది. ములుగు - ధర్మసాగర్, చలివాగు - ధర్మసాగర్ మధ్యలో పైపులైన్ మరమ్మతులు పూర్తిచేసి 4న ధర్మసాగర్‌కు నీటిని విడుదల చేశారు. వరంగల్ మహానగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు చర్యలు చేపట్టారు. ఇదే సమయంలో అటు గండిరామవరం, ఇటు ఆర్ఎస్ ఘన్‌పూర్ జలాశయాలకు నీటి సరఫరా ప్రారంభం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

నీరందించేలా చర్యలు తీసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్ జలాశయం నుంచి నవాబుపేటకు నీటిని సరఫరా చేసే కాల్వలు దెబ్బతిన్నాయి. మధ్యలో పాలకుర్తి నియోజకవర్గానికి నీటి మళ్లింపు, రెగ్యులేటర్ల ఏర్పాటు లేకపోవడంతో నవాబుపేట రిజర్వాయర్ పరిస్థితి ప్రశార్థకంగా మారింది. గండిరామవరం, బొమ్మకూరు జలాశయాల్లో నీటి మట్టం తగ్గడంతో కాల్వలకు నీటిని వదలడం లేదు. కాల్వల్లో బోరుమోటార్లు, పైపులు వేసి రైతులు నీటి కోసం పాట్లు పడుతున్నారు. చిన్ననీటి పారుదల పరిధిలోని చెరువులు, కుంటల్లోనూ నీటి మట్టం తగ్గి బోర్లు, బావులు ఎండిపోతున్నాయి. ధర్మసాగర్ చెరువు నుంచి జిల్లాలోని జలాశయాలకు తక్షణం నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. గండిరామవరం, బొమ్మకూరు జలాశయాల నుంచి కొంత మేర నీటి విడుదల చేస్తున్నట్లు అధికారులు చెప్తున్నా రైతులు మాత్రం తమ పొలాలకు నీరందడం లేదంటున్నారు. చీటకోడూరు కుడి కాల్వ భూసేకరణ వివాదం పరిష్కారం కాకపోవడంతో నీటి సరఫరా జరగడం లేదు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం- సుధీర్, జిల్లా సాగునీటి పారుదల శాఖాధికారి ధర్మసాగర్‌కు నీరు వచ్చే పైపులైన్ మరమ్మతులు పూర్తయ్యాయి. ఇక్కడి నుంచి రెండు మార్గాల్లో జిల్లాలోని జలాశయాలకు నీటి విడుదల ప్రారంభం కావాల్సి ఉంది. ప్రస్తుత నీటి నిల్వలు పక్షం రోజుల వరకు సరిపోతాయి. నీటి సమస్య పై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సమీక్షించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదిస్తాము.

# చిరు వ్యాపారం.. ఉపాధికి సోపానం

మానకొండూర్ : పొదుపు సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పయనిస్తున్నారు. సొంతంగా వ్యాపారాలు ప్రారంభించి ఒక్కోమెట్టు ఎక్కుతూ ప్రగతి వైపు అడుగులు వేస్తున్నారు. ఆర్థికంగా ఎదుగుతూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు. పొదుపు చేసుకున్న డబ్బుతో మార్కెటింగ్ రంగంలో పెట్టుబడులు పెట్టి లాభాలు పొందుతున్నారు. మానకొండూర్‌కు చెందిన ముగ్గురు మహిళలు సిరి, భరతమాత గ్రామైఖ్య సంఘంలో సభ్యులుగా కొనసాగుతున్నారు. స్వయం ఉపాధిలో రాణిస్తూ, స్వశక్తి సంఘాల మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్న అతివలపై కథనం. పాఠాలకు స్వస్తి పలికి..బీఈడీ పూర్తి చేశాను. ప్రైవేట్ బడిలో టీచింగ్ చేస్తుండగా కరోనా సమయంలో పాఠశాల మూతపడడంతో ఇంటికే పరిమితమయ్యాను. అప్పటికే సంఘంలో సభ్యురాలిగా ఉండడంతో కుట్టు శిక్షణ తీసుకున్నా. తర్వాత కంప్యూటర్ ఎంబ్రాయిడరీపై దృష్టి సారించి ఆరు నెలల క్రితం రూ.4 లక్షలు రుణం తీసుకొన్నాను. రూ.6.50 లక్షల పెట్టుబడితో వ్యాపారం మొదలు పెట్టాను. చీరలు, పంచెలు, గౌనులు, జాకెట్లపై యంత్రం ద్వారా రకరకాల అల్లికలు వేస్తున్నాను. నెలకు రూ.20 వేలకుపైగా ఆదాయం వస్తోంది.

వైద లత, మానకొండూర్ఆర్డర్‌పై ప్లేట్ల తయారీ

బ్యాంకు ద్వారా రూ.2 లక్షలు రుణం తీసుకొని కాగిత ప్లేట్లను తయారు చేసే యంత్రాన్ని కొనుగోలు చేశాను. ఇంటిలోనే యంత్రాన్ని పెట్టి ఆర్డర్‌పై ప్లేట్లను తయారు చేస్తున్నాను. సీజన్‌లో గిరాకి అధికంగా ఉంటుంది. దీంతో హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నాను. కుమార్తె బీటెక్, కుమారుడు ఇంటర్ చదువుతున్నారు. ఏడాది నుంచి ఇంట్లోనే ఉంటూ జీవనోపాధి పొందుతున్నాను. మెటీరియల్‌ను రాయితీపై అందజేస్తే మరింత మేలు కలుగుతుంది.

వేల్పుల సరిత, మానకొండూర్

ఇంటి వద్దే..నాలుగు నెలల క్రితం చాక్‌పీసుల తయారీ యంత్రాన్ని కొనుగోలు చేశాను. ఇందుకు బ్యాంకు ద్వారా రూ.2 లక్షలు రుణం తీసుకున్నాను. అప్పటి నుంచి సామగ్రి తెచ్చుకొని ఇంటి వద్దే చాక్‌పీసులను తయారు చేస్తున్నాను. ముందుగా ప్రైవేట్ పాఠశాల యజమానుల వద్దకు వెళ్లి ఆర్డర్ తీసుకొని తయారు చేస్తున్నాను. అన్ని ఖర్చులు పోను నెలకు రూ.11 వేలు సంపాదించుకోవడం తృప్తినిస్తోంది. ఈ వ్యాపారం సులభంగా ఉంది.పిట్టల అనూష, మానకొండూర్

# సైబర్ ఠాణా.. కేసుల ఛేదన!

వరంగల్: రాజధాని హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరం వరంగల్. ఓరుగల్లు విస్తరించే కొద్దీ అన్ని నేరాలతోపాటు సైబర్ నేరాలు సైతం ఏటికేడు పెరుగుతున్నాయి. కమిషనరేట్ పరిధిలో నిత్యం సైబర్ మోసాలకు గురవుతున్న బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఈ నేరాలపై ఉక్కు పాదం మోపేందుకు, కేసులను వేగంగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేసేందుకు వరంగల్‌కు ప్రభుత్వం సైబర్ ఠాణాను మంజూరు చేసింది. గతంలో ఆన్‌లైన్ మోసాలు జరిగితే బాధితుల ఫిర్యాదుతో హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసుల సహకారంతో విచారణ జరిపేవారు. కేసుల సంఖ్య పెరగడంతో 2018 మార్చి 18న వరంగల్ పోలీసు కమిషనరేటు పరిధిలో ప్రత్యేకంగా సైబర్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ మోసాల పరిష్కారంలో పురోగతి కనిపించింది. అయితే సైబర్ సెల్ లేదా సైబర్ ల్యాబ్‌గా పిలిచే ఇందులో ఆన్‌లైన్ మోసాలను దర్యాప్తు చేసే అవకాశమే కానీ, కేసు నమోదు చేసేందుకు వీల్లేదు. బాధితులు తమ పరిధిలోని పోలీసు స్టేషన్లలోనే ఇన్నాళ్లూ సైబర్ నేరాలపై ఫిర్యాదు చేస్తున్నారు. కానీ ప్రత్యేకంగా ఠాణా రావడం వల్ల మోసానికి గురైన వారు నేరుగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంది.

కమాండ్ కంట్రోల్‌తో..వరంగల్ కమిషనరేట్ హనుమకొండ, వరంగల్, జనగామ మూడు జిల్లాల పరిధిలో ఉంది. 2018లో మొత్తం 66 సైబర్ కేసులు నమోదు కాగా, 2019లో 100, 2021లో 106, 2022లో ఆ సంఖ్య ఏకంగా 560కు చేరింది. ఈ ఏడాది జులై వరకే 367 నమోదయ్యాయి. ఇలా నేరాల సంఖ్య ఏటికేడు పెరగడంతో




పోలీసులు ఈ విభాగంపై మరింత దృష్టిసారించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో సైబర్ ఠాణా మంజూరు అనివార్యమైంది. సైబర్ సెల్‌లో ఇప్పటి వరకు ఇన్‌స్పెక్టర్, కొందరు సిబ్బంది మాత్రమే పనిచేశారు. ఠాణా మంజూరుతో ఏసీపీ నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్, ఎస్.ఐలు, పది మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తిస్తారు. బాధితులు మోసానికి గురైన వెంటనే ఫిర్యాదు చేస్తే ఇక్కడే కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేసే అవకాశం ఉంది. బాధితులకు సత్వర న్యాయం అందే అవకాశం ఉంది. ఈ ఠాణా హైదరాబాద్‌లో కొత్తగా ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ కేంద్రంతో అనుసంధానమై ఉండడం వల్ల అత్యాధునిక సాంకేతికత అందిపుచ్చుకోవచ్చు. నేరాల ఛేదన కూడా వేగంగా జరిగే అవకాశం ఉంది.

అధునాతన పరికరాలు

నేరాల ఛేదనకు కొత్త సాఫ్ట్‌వేర్‌లు వస్తున్నాయి. ఉదాహరణకు వాట్సప్ సందేశాలు మొబైల్ నుంచి డెలిట్ చేసినా మళ్లీ వాటిని రాబట్టే సాఫ్ట్‌వేర్‌ను మన పోలీసులు ఇప్పటికే వినియోగిస్తున్నారు. కానీ ఇప్పటి వరకు ఈ సదుపాయం కోసం హైదరాబాద్ సైబర్ విభాగంపై ఆధారపడేవారు. ఠాణా వచ్చాక ఇలా అత్యాధునికమైన సాఫ్ట్‌వేర్‌లు, అనేక కొత్త పరికరాల ద్వారా కేసులను వేగంగా ఛేదించే అవకాశం ఉంది.వేగంగా విచారణ- ఏవీ రంగనాథ్, పోలీసు కమిషనర్

సైబర్ క్రైం స్టేషన్ రావడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. బాధితులు నేరుగా ఫిర్యాదు చేయొచ్చు. సిబ్బంది కూడా తగినంత మంది ఉంటారు. అత్యాధునిక సైబర్ పరికరాలు త్వరలో వస్తాయి. ప్రస్తుతానికి కమిషనరేట్లోని సైబర్ సెల్‌లోనే ఠాణా ఏర్పాటు చేశాం. త్వరలో ప్రత్యేక స్టేషన్‌లో కార్యకలాపాలు కొనసాగుతాయి.

## ప్రాంగణాల వినియోగానికి ఏర్పాట్లు

పెద్దపల్లి: ఆటల్లో ప్రతిభావంతులను వెలికితీసేందుకు ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. అయితే వీటి నిర్మాణాలు పూర్తి చేసి ఏడాది అవుతున్నా నిధులు లేక పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పూర్తి స్థాయిలో క్రీడా సామగ్రి సమకూర్చి నిర్ణీత పద్ధతిలో పోటీలు నిర్వహించేలా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద రెండేళ్లుగా జిల్లావ్యాప్తంగా 267 పంచాయతీలతో పాటు రామగుండం, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని పట్టణాల్లో క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. ఒక ఎకరం ప్రభుత్వ స్థలంలో రూ.4.17 లక్షలతో వీటి నిర్మాణం చేపట్టారు. నగర ప్రాంతాల్లో 100 నుంచి 400 గజాల్లోపు ప్రభుత్వ స్థలాలను ఎంపిక చేశారు. ఇందులో రూ.30 వేల వరకు ప్రాంగణం పేరుతో స్వాగత తోరణం, రూ.50 వేల వరకు వాలీబాల్, ఖోఖో సామగ్రి కోసం గతంలో వెచ్చించారు. మిగిలిన నిధులను కార్మికుల వేతనాలు, సుందరీకరణ కోసం ఖర్చు చేశారు. త్వరలోనే ప్రాంగణాలకు పరికరాలు, సామగ్రి రానుండటంతో క్రీడాకారుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

23 రకాల వస్తువులతో కిట్లు

ఒక్కో ప్రాంగణానికి రెండు కిట్లు సరఫరా చేయనున్నారు. ఇందులోనే 23 రకాల ఆట వస్తువులు, 75 టీ షర్టులు ఉంటాయి.

మండలానికో బఫర్ కిట్‌తో పాటు జిల్లా స్థాయిలో అదనంగా 30 నుంచి 40 కిట్లను అందుబాటులో ఉంచనున్నారు. వినియోగించగా పాడైన వాటి స్థానంలో అదనంగా కొత్త వాటిని ఇవ్వనున్నారు.

క్రికెట్ బ్యాట్, బాల్స్, 2 జతల చేతి తొడుగులు, స్టంప్స్ తదితర 12 రకాల వస్తువులు, వాలీబాల్స్, నెట్స్, వాలీబాల్‌కు గాలి కొట్టే పంపు, కొలతల టేపు, 3 సెట్ల డంబెల్స్, డిస్కస్ త్రో, టెన్నికాయిట్స్, తాడాటకు తాళ్లు, విజిల్స్, స్టాప్‌గో వాచ్, అదనపు కిట్‌బ్యాగ్ ఇలా మొత్తం 23 రకాల వస్తువులను ఇవ్వనున్నారు.

కిట్ల పంపిణీని పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షుడిగా ఉండే కమిటీలో అదనపు పాలనాధికారి(స్థానిక సంస్థలు), జిల్లా పంచాయతీ అధికారి, పుర కమిషనర్లు, జిల్లా యువజన క్రీడల అధికారి, కలెక్టర్ నియమించే ప్రత్యేకాధికారులు, గ్రామ, మండల, పట్టణ, నగర స్థాయి ప్రజాప్రతినిధులు సభ్యులుగా ఉంటారు.

# యథేచ్ఛగా ఆక్రమణలు..



మహబూబాబాద్ : జిల్లాలో వ్యవసాయ భూములను సస్య శ్యామలం చేసేందుకు ఎస్సారెస్పీ కాలువలను నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యంతో వాటికి సంబంధించిన భూములు ఎక్కడిక్కడే కబ్జాకు గురవుతున్నాయి. భూములను కొల్పోయిన రైతులకు సంబంధిత శాఖ ద్వారా పరిహారం పొందినా కాలువకు రెండువైపులా ఉన్న భూములను సమీపంలోని రైతులు తమ భూముల్లో కలిపేసుకుంటున్నారు. కొన్ని చోట్ల స్థిరాస్థి వ్యాపారులు ఆక్రమించారు. నీరు సరఫరా చేసినప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు అధికారులు వెళ్లలేకపోతున్నారు. చివరి ఆయకట్టు రైతులు కూడా అవస్థలు ఎదుర్కొంటున్నారు.

పలు ప్రాంతాల్లో ఇలా

కాలువల నిర్మాణం చేపట్టి అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసేందుకు వాటికి ఇరువైపులా నిర్మించే కట్టలపై 33 అడుగలు వెడల్పుతో దారి నిర్మించారు. పలు చోట్ల వాటిని కొందరు రైతులు సాగు భూముల్లో దున్నేశారు. కొన్నిచోట్ల క్రీడాప్రాంగణాలను నెలకొల్పారు. మహబూబాబాద్ పట్టణంలో స్థిరాస్థి వ్యాపారులు వెంచర్లలో కలిపేసి విక్రయించారు. తొర్రూరు, గూడూరు ప్రాంతాల్లో కొందరు కాలువల్లో రాళ్లు, మట్టి పోసి పూడ్చేశారు. అధికారులు కాలువలను పరిశీలన సమయంలో దారి లేక ఇతరుల పంటపొలాల గుండా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

స్టేజీ-1 పరిధి ఆయకట్టు (ఎకరాలు): 1,81,174 (సాగునీరందే మండలాలు కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు, మహబూబాబాద్, కురవి, డోర్నకల్)స్టేజీ-2 (ఎకరాలు): 41,564 (సాగునీరందే మండలాలు తొర్రూరు, పెద్దవ్మగర, మరిపెడ, దంతాలపల్లి, నర్సింహులపేట, చిన్నగూడూరు)ఎస్సారెస్పీ కాలువకు ఎడుమ వైపు దారి స్థలాన్ని సమీపంలోని రైతులు తమ భూమిలో కలిపివేసి పంటలను సాగు చేస్తున్న చిత్రం నెల్లికుదురులోనిది. స్టేజీ-1లోని డీబీఎం-48 నుంచి నిర్మించిన 10ఆర్1 కాలువ ఇది. దీనికి ఎడుమ, కుడివైపు 33 అడుగుల వెడల్పుతో దారి ఉండాలి. అది కూడా కాలువకు సంబంధించిన భూమే. ఎడుమ వైపు ఉన్న కొందరు రైతులు ఆ భూముని తమ స్థలంలో కలిపారు. పక్కనే వ్యవసాయ బావులను తవ్వారు. ఆ దారి గుండా సాగు భూములకు వెళ్లే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట ఉత్పత్తులను ఇంటికి చేర్చుకోవడానికి కష్టాలు పడుతున్నారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

దంతాలపల్లి నుంచి బొడ్లాడ, నెల్లికుదురు మండలం బ్రాహ్మణ కొత్తపల్లి రైతులకు సాగునీరిందించే ఎస్సారెస్పీ స్టేజీ-2 ఉపకాలువ. దీన్ని దంతాలపల్లి ప్రాంతంలోని డీబీఎం-60 నుంచి నిర్మించి 7ఎల్ ఉపకాలువ. దీని పరిధిలో సుమారు 2 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. కాలువకు రెండువైపులా దారి నిర్మించుకున్నారు. ఏ సమయంలోనైనా కాలువ దెబ్బతింటే పరిశీలించేందుకు ఇంజినీరింగ్ అధికారులు వాహనంలో చివరి వరకు వెళ్లొచ్చు. మధ్యలో కిష్టాపురం శివారులో కాలువ పక్కన పోసిన మట్టిని రైతులు తొలగించి సాగు చేసుకుంటున్నారు. దాంతో కాలువ చివరి వరకు వెళ్లడానికి ఇతర రైతులకు చెందిన పంటపొలాల నుంచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యతో చివరి ఆయకట్టులో తమ భూముల వద్దకు వెళ్లడానికి అవస్థలు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రానైట్ రాళ్లతో చిత్తడిగా కనిపిస్తున్న ఆ ప్రాంతంలో ఎస్సారెస్పీ కాలువ ఉంటుంది. ఇది నెల్లికుదురులో శివారులోనిది. గ్రామంలోని పులిచెరువులోకి గోదావరి జలాలను మళ్లించేందుకు నిర్మించారు. కాలువ సమీపంలో గ్రానైట్ క్వారీ ఉండడంతో దాని నిర్వాహకులు అందులో ఉపయోగపడని రాళ్లను పడేశారు. కాలువ ద్వారా నీటిని సరఫరా చేసినప్పుడల్లా అక్కడికి వరకు సాఫీగా వచ్చిన నీటికి అడ్డుకట్ట పడుతోంది. నీరు కాలువపై నుంచి సమీప పంట పొలాల్లోకి చేరుతుండడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం- కిషన్, ఏఈ, నెల్లికుదురు

చాలా చోట్ల కాలువ పక్క భూములు ఆక్రమణలకు గురయ్యాయి. దాంతో సమస్య ఎదురవుతుంది. అయితే ఆ ప్రాంతంలోని రైతులు ఫిర్యాదు చేస్తే పోలీసుల సహకారంతో చర్యలు తీసుకుంటాం. కాలువలను పూడ్చివేసినవి పరిశీలించి ఆ చర్యకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం. వాటిని తొలగిస్తాం.

# బుజ్జగింపులకు రంగం సిద్ధం



వరంగల్ : 'సార్ నేను పార్టీ కోసం కొన్నేళ్లుగా పనిచేస్తున్నా.. పదేళ్లుగా అధికారంలో లేకున్నప్పటికీ పార్టీ కార్యక్రమాలు నిర్వహించా. ఈసారి నాకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాల్సిందే'. అని కాంగ్రెస్ నాయకులు కరాఖండిగా చెబుతున్నారు. గతంలో ఎన్నాడూ లేనంతగా ఈసారి ఆశావహులు పెరిగారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాల నుంచి 98 మంది ఎమ్మెల్యే టికెట్ల కోసం దరఖాస్తు చేశారు. మూడు రోజుల క్రితం హైదరాబాద్ గాంధీ భవన్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశం జరిగింది. నియోజకవర్గాల వారీగా ఆశావహుల జాబితాను పరిశీలించారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మూడేసి పేర్లను ఖరారు చేయాలి. ఈ క్రమంలో పోటీ ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై కాంగ్రెస్ పెద్దలు దృష్టి సారించారు. దరఖాస్తు చేసిన నాయకులను పిలిచి మాట్లాడాలని అనుకున్నారు. స్క్రీనింగ్ కమిటీకి జాబితా పంపించే ముందు అందరినీ ఒప్పించి, మెప్పించాలని చూస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే టికెట్ కోసం దరఖాస్తు చేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇస్తామని భరోసా కల్పించాలని నిర్ణయించారు. నియోజకవర్గాల వారీగా నాయకులను బుజ్జగించేందుకు అధిష్ఠానం వ్యూహరచన ఖరారు చేస్తోంది. కర్ణాటక రాష్ట్రంలో అమలు చేసిన విధానాన్ని తెలంగాణలో అమలు పరచాలని చూస్తున్నారు.

ఈ నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి

వర్ధన్నపేట నుంచి 18 మంది నాయకులు దరఖాస్తు చేశారు. ఇక్కడ పోటీ తీవ్రంగా ఉంది. అందరినీ పిలిపించి మాట్లాడాలని నిర్ణయించారు. వర్ధన్నపేటపై టీపీసీసీ ప్రత్యేక దృష్టి సారించింది.

పాలకుర్తిలో 12 మంది టికెట్ ఆశిస్తున్నారు. ఇక్కడ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఎదుర్కొనే వారిని ఎంపిక చేయాలని చూస్తున్నారు. అందరితో సంప్రదింపులు జరుపుతున్నారు.

వరంగల్ పశ్చిమ, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 11 దరఖాస్తులు వచ్చాయి. పశ్చిమలో పాగా వేసేందుకు అధిష్ఠానం సీరియస్‌గా దృష్టి పెట్టింది. ఆశావహులందరినీ బుజ్జగిస్తోంది. స్టేషన్‌ఘన్‌పూర్‌లో టికెట్ల గొడవలు పెరిగాయి. ఇక్కడ కూడా పెద్దలు నజర్ వేశారు.

వరంగల్ తూర్పులో 8 మంది దరఖాస్తు చేశారు. నలుగురి మధ్య ప్రధాన పోటీ ఉంది. వీరిని సమన్వయ పర్చడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. పరకాల, జనగామ, మహబూబాబాద్‌లో పోటీ తగ్గించేందుకు ముందస్తుగానే బుజ్జగించేందుకు రంగం సిద్ధమైంది.

# తప్పనున్న ముంపు ముప్పు

వరంగల్ : వరంగల్ నగరాన్ని ఏటా వర్షాకాలం వరదలతో ముంచెత్తుతున్న బొందివాగు నాలా సమస్య తీరనుంది. ముంపు నుంచి శాశ్వత పరిష్కారం కోసం రంగం సిద్ధమయింది. సుమారు 15-20 కాలనీలకు ముంపు ముప్పు తప్పనుంది. బొందివాగు నాలా ద్వారా వచ్చే వరద నీటిని నేరుగా భద్రకాళి చెరువులోకి మళ్లించేందుకు అడుగులు పడుతున్నాయి. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.158.06 కోట్లు కేటాయించింది. 2020 సెప్టెంబరులో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చేసిన సూచన మేరకు రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ ఇంజినీర్లు బొందివాగు నాలా వరద ముంపుపై సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయడంతో నిధులు విడుదలయ్యాయి. సాగునీటి పారుదలశాఖ అధికారుల పర్యవేక్షణలో పనులు చేపట్టనున్నారు.

పలు కాలనీలకు ఉపశమనం..హంటర్‌రోడ్ బొందివాగు నాలా వరదల కారణంగా గత 15 ఏళ్లుగా పలు కాలనీలు నీట మునుగుతున్నాయి. ఏటా వర్షాకాలంలో ఆయా కాలనీల ప్రజలు ముంపుతో తీవ్రంగా నష్టపోతున్నారు. శాశ్వత పరిష్కారం పనులు పూర్తయితే సాయినగర్, ఎన్టీఆర్‌నగర్, గాయత్రినగర్, సంతోషిమాత కాలనీ, సంతోషిమాత-2, భద్రకాళినగర్, వాసవీ కాలనీ, హంటర్‌రోడ్, రామన్నపేట బీస్మీ కాలనీ, పోతననగర్, న్యూ పోతననగర్, సరస్వతీనగర్, రంగంపేట తదితర కాలనీలకు వరద ముప్పు నుంచి ఉపశమనం కలిగే అవకాశాలున్నాయి.

ఏయే పనులు చేపడతారంటే..బొందివాగు రైల్వే ట్రాక్ వద్ద నుంచి హంటర్‌రోడ్ ప్రధాన రోడ్డు మీదుగా భద్రకాళి చెరువు కట్ట వరకు 120 అడుగుల మేర నాలా విస్తరణ. వరద నీటి కాలువలు, ఇరువైపులా గోడల నిర్మాణం.భద్రకాళి చెరువు కట్ట వద్ద ప్రస్తుతం రెండు ఫ్వలింగ్ షట్టర్లు ఉన్నాయి, ఇవి 5 సెంటీ మీటర్ల వర్షపాతం కురిస్తే వరద పారే సామర్థ్యంతో ఉన్నాయి. భవిష్యత్తు దృష్ట్యా 30 సె.మీ. వర్షపాతం కురిసినా వరదను తట్టుకునేలా పది గేట్లతో క్రాస్ రెగ్యులేటర్ (కాకతీయ కెనాల్ గుండ్ల సింగారం వద్ద ఉన్నట్లుగా) ఏర్పాటు చేస్తారు. భారీ వర్షాలు కురిసినప్పుడు గేట్లను ఎత్తి వరదనీరు నేరుగా భద్రకాళి చెరువులోకి వెళ్లేలా ఏర్పాటు చేస్తారు. కాలనీల వైపు వరదనీరు వెళ్లకుండా గోడలు నిర్మిస్తారు.భారీ వర్షాలు కురిసే సూచనలున్నప్పుడు భద్రకాళి చెరువులోని నీరంతా ముందస్తుగా ఖాళీ చేసేందుకు వరంగల్ పోతననగర్ మత్తడి, హనుమకొండ కాపువాడ మత్తడిల వద్ద డౌన్ స్ట్రీమ్ ఫ్వలింగ్ షట్టర్లు కొత్తగా ఏర్పాటు చేస్తారు.కాపువాడ, పోతననగర్ మత్తడుల ద్వారా పారే వరదనీరు నేరుగా నాగారం చెరువులోకి వెళ్లేందుకు అనుబంధంగా రెండు నాలాలు అభివృద్ధి పరుస్తారు.

# ప్రాధాన్యం సరే.. నిర్వహణ ఏదీ?

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో ప్రాధాన్యం ఇచ్చారు. రద్దీ ప్రాంతాలతోపాటు అవసరమున్న చోట చెత్తా బయటకు కనిపించకుండా అండర్‌గ్రౌండ్ డస్ట్ బిన్స్ ఏర్పాటు చేసేలా ప్రణాళిక రచించారు. దానికి అనుగుణంగా రూ.1.63 కోట్లతో స్మార్ట్ బిన్స్ కొనుగోలు, బిగింపు పనులు పూర్తి చేశారు. దీనికి అనుసంధానంగా ఉండే కంపాక్టర్ స్టేషన్, రెండు వాహనాలు కలిపి రూ.2 కోట్లతో హౌసింగ్‌బోర్డుకాలనీలో షెడ్డు ఏర్పాటు చేశారు. స్మార్ట్ బిన్స్‌ను పూర్తిగా సాంకేతికను ఉపయోగించి వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నారు. సెన్సార్ ద్వారా జీపీఎస్ విధానం అమల్లోకి తేవాల్సి ఉంటుంది. ఒక్కో డబ్బాలో చెత్త ఎంతమేర నిండిందనే విషయం ఎప్పటికప్పుడు సంబంధిత అధికారికి, వాహన డ్రైవర్‌కు చెందిన సెల్‌ఫోన్‌కు సమాచారం వెళుతుంది. ప్రాజెక్టు విషయంలో నాన్చుడు ధోరణి అవలంబి స్తున్నారు.

శిక్షణ లేక.. మూలనపడిన వాహనాలు

చెత్తను తగ్గించేందుకు 12 టన్నుల సామర్థ్యంతో కంపాక్టర్ స్టేషన్ నిర్మించారు. ఈ స్మార్ట్ బిన్స్ నుంచి వచ్చే చెత్తను ఇందుల్లోకి పంపించి తగ్గిస్తారు. ఆ తర్వాత డంపింగ్‌యార్డుకు తీసుకెళ్తారు. కంపాక్టర్ వాహనంతోపాటు హుక్ లోడర్ వాహనం అందుబాటులో ఉంది. ఇద్దరు డ్రైవర్లు, కార్మికులను వీరి కోసం నియమించారు. సాంకేతిక పరంగా వీరికి తెలియకపోవడం, వాహనాలు, డబ్బాలు ఎలా తీయాలనే విషయాలపై శిక్షణ ఇవ్వకపోవడంతో వారు ఖాళీగా ఉంటున్నారు.

పత్తా లేని నిర్వాహకుడు



స్మార్ట్‌సిటీలో భాగంగా చెత్త డబ్బాలు ఏర్పాటు చేసి వాహనాలను సమకూర్చిన నిర్వాహకుడు పత్తా లేకుండాపోయారు. సదరు సంస్థకు పూర్తి స్థాయిలో బిల్లు చెల్లించడంతో ఈ వైపు కన్నెత్తి చూడటంలేదని అంటున్నారు. వాస్తవంగా రెండేళ్ల వరకు నిర్వహణ చూసుకోవాల్సి ఉండగా, ఎలాంటి స్పందన లేకపోవడంతో అధికారుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారా? వదిలేస్తారా? చూడాలి.సప్తగిరికాలనీలోని ప్రభుత్వ పాఠశాల వెనుక ఉన్న స్మార్ట్ డబ్బాలు చూస్తే అందులో ఏమి లేనట్లుగా కనిపిస్తోంది. మూత విప్పితే దుర్గంధం వెదజల్లుతోంది. చెత్త నిండినా శుభ్రం చేయడం లేదు.

హౌసింగ్‌బోర్డుకాలనీలోని సబ్‌స్టేషన్ పక్కన ఉన్న స్మార్ట్ బిన్స్ నిండాయి. చెత్తంతా బయటకు వస్తుండగా రహదారిపై చెత్తా చెదారం పందుల స్వైరవిహారంతో అధ్వానంగా మారుతోంది.

కశ్మీర్‌గడ్డలోని మహిళా డిగ్రీ కళాశాల వెనుకాల ఏర్పాటు చేసిన స్మార్ట్ బిన్స్ పూర్తి స్థాయిలో పనులు చేయకుండా వదిలేశారు. పైకప్పులు లేకపోగా చెత్తా చెదారంతో కుళ్లిపోగా, అందులో నీరు నిలిచి దోమలకు ఉత్పత్తి కేంద్రంగా తయారైంది.

కొన్ని చోట్ల అసంపూర్తిగా..


భూగర్భ చెత్త డబ్బాలను పది చోట్ల బిగించాల్సి ఉండగా ఎనిమిది చోట్లకే పరిమితమయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రి వెనుకాల, ఆర్టీసీ బస్టాండ్ వెనుక, చైతన్యపురి కూరగాయల మార్కెట్, మహిళా డిగ్రీ కళాశాల వెనుక, సప్తగిరికాలనీ, హౌసింగ్‌బోర్డుకాలనీ తదితర ప్రాంతాల్లో బిగించారు. కొన్ని చోట్ల అసంపూర్తి పనులతో వదిలేశారు.

మూత తెరిస్తే వాసన

పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ డబ్బాల్లో చెత్త నిండింది. చైతన్యపురి, హౌసింగ్‌బోర్డుకాలనీ, కశ్మీర్‌గడ్డ నుంచి ప్రతి రోజు ఆ డబ్బాలపై ఫిర్యాదులు వస్తున్నాయి. చెత్త తొలగించాలని చెబుతుండగా కనీసం ఆ వైపు కన్నెత్తి చూడటంలేదు. ఒక్కో డబ్బాలో ఒక టన్ను చెత్త నిండేలా నిర్మించారు. దీనిని వాహనం ద్వారానే తరలించాల్సి ఉంటుంది. కార్మికులతో సాధ్యం కాకపోవడంతో వాటిని అలాగే వదిలేశారు.

## ఉమ్మడి జిల్లాలో సాగు శతశాతం

జగిత్యాల : ఉమ్మడి జిల్లాలో జులై మాసంలో భారీవర్షాలతో పంటలసాగు ఆరంభంలోనే తీవ్రంగా నష్టం కలిగించినా తదుపరి సానుకూల పరిస్థితులు నెలకొనటంతో పైర్ల సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. వ్యవసాయశాఖ బుధవారం వెల్లడించిన తాజా నివేదిక ప్రకారం నాలుగు జిల్లాల్లోనూ అన్నిపంటల సాగు శతశతానికి చేరింది.జూన్ 1 నుంచి ఇప్పటివరకు కరీంనగర్ జిల్లాలో 564.3 మి.మీ సాధారణ వర్షానికిగాను 38.7 శాతం అధికంగా 782.9 మి.మీ వర్షం కురిసింది. జగిత్యాలలో 688.2 మి.మీ.కుగాను 18.2 శాతం అధికంగా 813.7 మి.మీ, పెద్దపల్లిలో



665.3 మి.మీ.కుగాను 28.5 శాతం అధికంగా 855.1 మి.మీ, సిరిసిల్లలో 554.9 మి.మీ.కుగాను 37.4 శాతం అధికంగా 762.4 మి.మీ వర్షం కురిసింది. అధిక వర్షంతో చిన్ననీటి వనరులైన చెరువులు, కుంటల్లోకి నీరుచేరటం, ఆయకట్టుకు శ్రీరాంసాగర్, ఎల్ఎండి తదితర ప్రాజెక్టుల నీరు వదలటం, వరద కాలువలో నిండుగా నీటిని నిల్వచేయటం, సగటు భూగర్భ జలమట్టం 2.05 మీటర్ల నుంచి 4.61 మీటర్ల కనిష్ఠ లోతులో ఉండటం తదితరాలు పైర్లసాగుకు ఉపయుక్తంగా నిలిచాయి.

ఈసారి పత్తి, మక్క, సోయా సహా పలు ఆరుతడి పంటల విస్తీర్ణం గణనీయంగా తగ్గి వరివిస్తీర్ణం పెరిగింది. జులైలో కురిసిన వర్షాలతో పలు ఆరుతడి పంటలు దెబ్బతినగా చాలామంది రైతులు ఆరుతడి పంటలను తీసివేసి వరిసాగు చేపట్టారు. నీటి లభ్యతతో చాలా మంది వరివైపు మొగ్గగా నార్లుపోసి నాట్లువేయటం, నేరుగా వెదజల్లి, డ్రమ్‌సీడరుతో విత్తటం తదితర విధానాలను అనుసరించారు. ఇప్పటిదాకా వరిసాగు చేయగా జగిత్యాల జిల్లాలో రికార్డుస్థాయిలో వరివిస్తీర్ణం 3 లక్షల ఎకరాలను దాటి రాష్ట్రంలోనే 5వ స్థానానికి చేరింది. జిల్లాలవారీగా అన్ని పంటలసాగు కరీంనగర్‌లో 99.30, పెద్దపల్లి 98.47, జగిత్యాల 106.84, రాజన్న సిరిసిల్లలో 97.33 శాతంగా నమోదుకాగా మరో వారం రోజుల వరకు వానాకాలం పైర్లసాగుకు అదనుండటంతో విస్తీర్ణం వందశాతం దాటే అవకాశముంది.

# బదిలీలపై చిగురించిన ఆశలు!

భూపాలపల్లి : కొన్ని నెలలుగా కోర్టు వివాదాలతో నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీలకు ఎట్టకేలకు హైకోర్టు పచ్చజెండా ఊపడంతో ఉపాధ్యాయ వర్గాల్లో ఆశలు చిగురించాయి.. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల జీవోపై గత మార్చి 14న హైకోర్టు స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయిన విషయం తెలిసిందే. గతంలో ఇచ్చిన ఉత్తర్వులను రెండు రోజుల క్రితం హైకోర్టు ఎత్తివేసి, బదిలీలను కొనసాగించడానికి అనుమతిచ్చింది. ఈ మేరకు భార్యాభర్తలు కలిసి ఉండేందుకు వీలుగా అదనపు పాయింట్లు కేటాయించడానికి అనుమతిచ్చి, ఉపాధ్యాయ సంఘాల నేతలకు మాత్రం అదనపు పాయింట్ల విషయంలో అంగీకారం తెలపలేదు. తుది తీర్పునకు లోబడి బదిలీలు, పదోన్నతులు చేపట్టుకోవచ్చని పేర్కొంది. దీంతో ఈ హైకోర్టు తీర్పుతో ఇప్పటికైనా తమ నిరీక్షణకు తెర పడుతుందా..? లేదా..? అనే విషయంపై ఉపాధ్యాయుల్లో చర్చ మొదలైంది. అదేవిధంగా బదిలీల షెడ్యూల్ జారీపైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో అయోమయం నెలకొంది. త్వరలోనే ప్రక్రియ మొదలయ్యే ఉందని ఉపాధ్యాయ సంఘాల నేతలు చెబుతున్నారు.

దరఖాస్తులు పెరిగే అవకాశం

బదిలీల ప్రక్రియ నిలిచిపోయి ఆరు నెలలు గడిచిపోవడంతో ఎనిమిదేళ్లు, అయిదేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు, హెచ్‌ఎంల సంఖ్య మరింత పెరగనుంది. కిందటిసారి 2015లో భారీగా ఉపాధ్యాయుల బదిలీలు కాగా వారిలో గత జులై చివరి వారంలో ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు అధిక సంఖ్యలో ఉంటారని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. అదేవిధంగా 2018లో 317 జీవో ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా బదిలీల ప్రక్రియ కొనసాగింది. అనంతరం 2023 జనవరిలో ప్రభుత్వ ఉత్తర్వులు 5 ద్వారా బదిలీలు, పదోన్నతుల



షెడ్యూల్ విడుదల చేశారు. బదిలీల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసిన అనంతరం కొంత మంది ఉపాధ్యాయులు ఆ జీవోపై కోర్టును ఆశ్రయించడం ద్వారా ప్రక్రియ వాయిదా పడింది. దీంతో అప్పట్లోనే బదిలీలు, పదోన్నతులు ఆగిపోవడంతో ఉపాధ్యాయ వర్గాలు అసంతృప్తికి గురయ్యాయి. ఈ క్రమంలోనే హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేస్తూ, బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల్లో ఆశలు చిగురించాయి. షెడ్యూల్ జారీ చేస్తే గానీ బదిలీల ప్రక్రియ ఎప్పుడు మొదలవుతుందనేది తేలనుంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే.. ఈ ప్రక్రియ నిలిచిపోయే అవకాశం ఉంది. అంతకుముందే షెడ్యూల్ జారీ చేయాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై ఉత్కంఠ

హైకోర్టు స్టే ఎత్తివేసినప్పటికీ త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందోనని ఉపాధ్యాయుల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం ప్రక్రియ చేపట్టి ఏదైనా పొరపాటు జరిగితే ప్రభుత్వానికే చెడ్డపేరు వస్తుందేమోనని భావిస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో సవాలు చేసే అవకాశాలు లేకపోలేదని ఉపాధ్యాయ సంఘాల నేతలు చర్చించుకుంటున్నారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి, పక్కాగా పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

వెంటనే ప్రక్రియ చేపట్టాలి– పెండం మధుసూదన్, ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

హైకోర్టు ఇచ్చిన తీర్పును ఉపాధ్యాయ లోకం స్వాగతిస్తోంది.. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ వెంటనే చేపట్టాలి. బదిలీల కటాఫ్ తేదీ ఆగస్టు 31 వరకు తీసుకోవాలి. మిగిలిన ఖాళీల కోసం కొత్త నియామకాలు చేపట్టాలి. మారుమూల అటవీ గ్రామాల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాల్సిన అవసరం ఉంది. సంఘం బాధ్యులకు ఇచ్చే పాయింట్ల విషయంలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలి.

ఎన్నికల కోడ్ రాకముందే..– ఎండి.దిల్షాద్, ఆర్‌యూపీపీటీఎస్ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వం హైకోర్టు తీర్పు ప్రకారం బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఏమాత్రం ఆలస్యం చేయకుండా, ఎన్నికల కోడ్ రాకముందే పూర్తి చేయాలి. దశాబ్దాలుగా శ్రమ దోపిడీకి గురవుతున్న పండిట్, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలి. స్పౌజ్ టీచర్ల కోరిక మేరకు బదిలీలు చేపట్టాలి. సీపీఎస్‌ను వెంట్రనే రద్దు చేయాలి.

పారదర్శకంగా ఉండాలి..– మందల తిరుపతిరెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు, హనుమకొండ

ఉపాధ్యాయ బదిలీలకు న్యాయస్థానం అనుమతివ్వడం సంతోషకరం. తొమ్మిదేళ్ల తర్వాత చేపట్టబోయే బదిలీల ప్రక్రియ కాలయాపన లేకుండా పారదర్శకంగా చేపట్టాలి. విద్యాశాఖ వెంటనే బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేయాలి. బదిలీల కటాఫ్ తేదీని సెప్టెంబరు 1 వరకు పరిగణనలోకి తీసుకోవాలి.

# ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటెప్పుడు?

ములుగు : ప్రజలకు సేవలను మరింత సులభం చేసేందుకు ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ములుగు జిల్లాను ఆలస్యంగా ఏర్పాటు చేసింది. జిల్లా ఏర్పాటై సుమారు ఐదేళ్లు కావస్తున్నా.. ఇప్పటికీ పూర్తిస్థాయిలో జిల్లాస్థాయి ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయకపోవడంతో.. పరిపాలన జిల్లా ప్రజలకు అందుబాటులోకి రాలేదు. దీంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. నేడు, రేపు అంటూ ఏళ్లు గడిచాయి. వచ్చే డిసెంబర్‌లో శాసనసభ ఎన్నికలు జరుగుతాయనే ఊహాగానాల నేపథ్యంలో ములుగు జిల్లా కేంద్రంలో కార్యాలయాల ఏర్పాటు పూర్తవుతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.మొత్తం 61 శాఖలు జిల్లా కేంద్రంలో మొత్తం 61 ప్రభుత్వ కార్యాలయాలు ఉండాలి. అన్ని శాఖలు అందుబాటులో ఉన్నప్పుడే పరిపాలన మెరుగవుతుంది. ఏ ఒక్కటి అందుబాటులో లేకున్నా.. ఇబ్బందికరంగానే ఉంటుంది. మొత్తం 61 శాఖలకు 47 మాత్రమే ఏర్పాటు చేశారు.జిల్లా ఎక్సైజ్, అగ్నిమాపక, టీఎస్‌ఎన్పీడీసీఎల్ (ఎస్‌ఈ), దేవాదాయ ధర్మాదాయ, వయోజన విద్య, తూనికలు కొలతలు, ఏడీ లాండ్ సర్వే, పర్యాటకం, ఆర్టీసీ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, పరిశ్రమలు, కమర్షియల్ ట్యాక్స్. కాలుష్య నియంత్రణ, ఐటీ టవర్స్ కార్యాలయాలు ఏర్పాటు కావాల్సి ఉంది.

ఇన్‌ఛార్జి అధికారులే దిక్కుకార్యాలయాలు ఏర్పాటు చేయకపోవడంతో.. పక్క జిల్లాల అధికారులు ఇక్కడ ఇన్‌ఛార్జులుగా వ్యవహరిస్తున్నారు. వీరు వారానికి ఒకసారి కూడా జిల్లాకు రాకపోవడంతో.. జిల్లా ప్రజలకు అందాల్సిన ఫలాలు అందడం లేదు.

# పల్లె వెలుగు ప్రయోజనం




ఖమ్మం : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వల్ప దూరం ప్రయాణించే పల్లె వెలుగు ప్రయాణికుల సౌలభ్యం కోసం టీఎస్ ఆర్టీసీ రాయితీ పథకాలను అమలు చేస్తోంది. బస్సుల్లోనే టీ9–60, టీ9–30 టికెట్లను విక్రయిస్తూ ఆర్థిక భారం తగ్గించుకునే ప్రయత్నం చేస్తోంది. ఇవి కొనుగోలు చేస్తే ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 వరకు తక్కువ ధరతో రాకపోకలు సాగించే వీలుంది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రయాణికులకు ఇవి ఉపయుక్తంగా ఉంటున్నాయి. ఒక్కో టికెట్ కొనుగోలుపై ఒక్కొక్కరికి రూ.10 నుంచి రూ.30 వరకు ఆదా అవుతుంది. ఖమ్మం రీజియన్ పరిధిలో రాయితీ టికెట్ల విక్రయాలకు మిశ్రమ స్పందన కనిపిస్తోంది. రాష్ట్రంలో తొమ్మిది రీజియన్లతో పోలిస్తే చివరి స్థానంలో ఉంది. వీటిపై మరింత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉంది.

ఇవిగో టికెట్లు..టీ9–60 టికెట్‌కు రూ.100 చెల్లిస్తే పల్లె వెలుగు బస్సుల్లో రాత్రి 9 గంటల వరకు 60 కిమీ లోపు రాకపోకలు సాగించే వెసులుబాటు ఉంది. మహిళలు, సీనియర్ సిటిజన్ల కోసం ప్రవేశపెట్టిన వీటిని పురుషులకు కూడా వర్తింపజేస్తున్నారు. టీ9–30 టికెట్ ప్రయోజనాలు కూడా ఇదే స్థాయిలో ఉన్నాయి. రూ.50 చెల్లించి 30 కిమీ ప్రయాణించే అవకాశం ఆర్టీసీ కల్పించింది. ఖమ్మం రీజియన్ పరిధిలో పల్లె వెలుగు బస్సుల్లో ప్రతిరోజు సుమారు 80 వేల మంది ప్రయాణిస్తున్నారు. రాయితీ టికెట్లు వినియోగించుకునే అర్హత కలిగిన వారు 70 శాతం మంది ఉంటున్నట్లు ఆర్టీసీ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు రాయితీలపై సరైన సమాచారం లేకపోవడం, అవగాహన రాహిత్యం కారణంగా స్పందన నామమాత్రంగా ఉంది. రీజియన్ పరిధిలో టీ9–60 టికెట్లను రోజుకు సగటున 100 నుంచి 250 మంది మాత్రమే కొనుగోలు చేస్తుండగా.. టీ6–30వి 270 నుంచి 330 వరకు వినియోగించుకుంటున్నారు. గడిచిన 2 నెలల్లో వినియోగదారుల సంఖ్య కాస్త పెరుగుతున్నా ఆర్టీసీ అధికారులు ఆశించిన స్థాయిలో లేవు. విక్రయాలు పెరగాలంటే పథకాల ఉద్దేశం ప్రజలకు చేరువయ్యేలా.. ఆర్టీసీ ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రయాణికుల సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

బస్‌స్టేషన్లలో విస్తృత ప్రచారం కల్పిస్తున్నాం. ఫ్లెక్సీలు, ప్రచార బోర్డులు ఏర్పాటు చేశాం. బస్సుల వెనక భాగంలో ప్రచార నినాదాలు రాయించాం. కండక్టర్లకు ప్రత్యేక సూచనలు చేశాం. ప్రతినెలా ఎక్కువ టికెట్లు విక్రయించిన వారికి బహుమతులు ప్రదానం చేస్తున్నాం. పల్లె వెలుగు బస్సుల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల మిగతా రీజియన్లతో పోలిస్తే కాస్త తక్కువ విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించాం. ప్రయాణికులు అందరూ వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటాం.
సీహెచ్ వెంకన్న, ఖమ్మం ప్రాంతీయ మేనేజర్

# ముర్రేడు ముంపు ముప్పు తప్పేలా..



కొత్తగూడెం: ఏటా వానాకాలంలో ముర్రేడు వాగుకు అనుకొని ఉన్న కాలనీలు జలమయమవుతున్నాయి. గతేడాది సంజయ్ నగర్ పంచాయతీ పరిధిలోని ఉపేంద్రనగర్‌లో కొన్ని నివాసాలు, ప్రశాంతినగర్‌లో ఓ పాఠశాల భవనం కోతకు గురయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు తీవ్రంగా ఆస్తినష్టం వాటిల్లింది. ఈ సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులు ఈ ఏడాది జనవరిలో కొత్తగూడెం వచ్చిన సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ముర్రేడు వాగుకు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. వాగు పరివాహక ప్రాంతాలను సర్వే చేసిన అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో గ్యాబ్రియన్ వాల్ నిర్మాణానికి రూ.33.5 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వ ఇటీవల ఉత్తర్వును వెలువరించింది.

ఎగువన 300 మీటర్లు.. దిగువన 700 మీటర్లు..

కొత్తగూడెం పట్టణం– లక్ష్మీదేవిపల్లి మండలాలను కలిపే వంతెనకు (ముర్రేడు వాగుపై నిర్మించింది) ఎగువ భాగంలో 300 మీటర్లు, దిగువన 700 మీటర్లు మొత్తంగా కి.మీ. మేర గ్యాబ్రియన్ వాల్ నిర్మించటానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. మరో నెల రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తామని చెబుతున్నారు. గ్యాబ్రియన్ వాల్ నిర్మాణం పూర్తైతే లక్ష్మీదేవిపల్లి మండలంలో వాగుకు ఆనుకొని ఉన్న సుమారు 50 కుటుంబాలకు రక్షణ దొరికినట్టే.

ముర్రేడు వాగు వరద ఉద్ధృతికి కోతకు గురవుతున్న ప్రాంతాల్లో గ్యాబ్రియన్ వాల్ నిర్మించనుండటం అభినందనీయం. ఏటా వానాకాలంలో వాగుకు ఆనుకొని ఉన్న ఉపేంద్రనగర్ జలమయమవుతోంది. రెండేళ్లుగా వాగు కోతకు గురవుతోంది. ఈ ఏడాది పలువురి ఇళ్లు కూలిపోయి ఆస్తినష్టం సంభవించింది. గ్యాబ్రియన్ వాల్ నిర్మిస్తే ముర్రేడు పరివాహక ప్రాంతాల ప్రజలకు ముంపు ముప్పు తప్పుతుంది.
రాజేశ్వరరావు, ఉపేంద్రనగర్

గ్యాబ్రియన్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ముర్రేడు వాగు పరివాహక ప్రాంతంలో కాంక్రీట్ గోడ నిర్మించడం సాధ్యం కాకపోవడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నెలరోజుల్లో టెండర్ ప్రక్రియను పూర్తి చేసి నవంబర్‌లో పనులు ప్రారంభిస్తాం. వర్షాకాలం నాటికి గోడ నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.
రాంబాబు, డీఈ, జలవనరుల శాఖ

# రుణమాఫీకి చిక్కుముళ్లు




ఖమ్మం : తెలంగాణ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ పథకం ప్రకటించి అమలుచేస్తోంది. అయితే కొంతమంది రైతులు తమకు మాఫీ వర్తించడం లేదని తరచూ అధికారులను కలిసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌డేలో సైతం వినతి పత్రాలు అందజేస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వం రూ.99,999 వరకు మాఫీ ప్రకటించిన తర్వాత ఈ సమస్యలు మరింత పెరిగాయి. అర్హులైన ప్రతి ఒక్కరికి మాఫీ వర్తింపజేసేలా జిల్లా అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటోంది. ఇందుకు అనుగుణంగా జిల్లా వ్యవసాయశాఖ, జిల్లా అగ్రణీయ బ్యాంకుతో పాటు పంట రుణాలు అందించిన ప్రధాన బ్యాంకుల అధికారులతో సమావేశాలు నిర్వహించి వీటిని పరిష్కరించేందుకు యత్నిస్తోంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఎస్‌బీఐ, ఏపీజీవీబీ, డీసీసీబీ, యూబీఐ, ఐఓబీ లాంటి బ్యాంకులు రైతులకు పంట రుణాలు మంజూరు చేస్తున్నాయి. ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు 75,778 మంది రైతులకు రూ.374.40 కోట్ల రుణమాఫీ నిధులను బ్యాంకుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ప్రధాన సమస్యలు ఇవే...

1. రద్దయిన ఖాతాలతో ఇబ్బందులు...

11.12.2018 నుంచి పంట రుణాలు తీసుకున్న రైతులకు ప్రభుత్వం రుణమాఫీ వర్తింపజేసింది. తర్వాత కొందరు రుణాలు చెల్లించి, బ్యాంకు ఖాతాలను సైతం రద్దు చేసుకున్నారు. ఇతర కారణాలతో కొంతమంది ఖాతాలు రద్దు చేసుకున్నారు. ఇలాంటి వారి ఖాతాల్లో ఇప్పుడు రుణమాఫీ నిధులు జమకాలేదు. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు వెనక్కు మళ్లాయి. ఇలాంటి రైతులు తమకు మాఫీ రాలేదని అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. వెనక్కు మళ్లిన నిధులను తెప్పించి, సంబంధిత ఖాతాలను పునరుద్ధరించి అర్హులైన రైతులకు లబ్ధి చేకూర్చాలని అధికారులు భావిస్తున్నారు.

2. బంగారం తాకట్టు రుణాలపై రాని స్పష్టత....

వ్యవసాయ పెట్టుబడుల కోసం చాలామంది రైతులు గ్రామీణ బ్యాంకుల్లో అగ్రికల్చరల్ గోల్డ్ లోన్స్ (బంగారం తాకట్టు రుణాల)ను తీసుకుంటారు. ఇలా గ్రామీణ ప్రాంతాల్లో తీసుకునే రుణాలకు కూడా మాఫీ వర్తిస్తుంది. అర్బన్, మెట్రోపాలిటన్ ప్రాంతాల్లో తీసుకునే వారికి వర్తించదు. కానీ ఈసారి ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో రుణాలు తీసుకున్న వారికి మాఫీ గురించి స్పష్టమైన ఆదేశాలు లేవు. ఖమ్మం పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో ఉండే రైతులకు ఖమ్మం నగరంలోని సహకార, వాణిజ్య బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. అర్బన్, మెట్రోపాలిటిన్ నిబంధన వల్ల వ్యవసాయం చేసుకునే రైతులకు మాఫీ వర్తించకపోవటంతో ఇబ్బంది పడుతున్నారు. ఉదాహరణకు నగరంలోని పీఎస్ఆర్ రోడ్డు వెంట ఏపీజీవీబీ, డీసీసీబీ అంబేద్కర్, ప్రకాశ్‌నగర్ బ్రాంచిలున్నాయి. వీటికి సంబంధించిన రుణ మాఫీ సైతం ఆగిపోవడంతో స్పష్టత కోసం జిల్లా అధికారులు రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులను సంప్రదిస్తున్నారు. ముదిగొండ మండలం వల్లభిలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో బంగారం తాకట్టు రుణాలు తీసుకున్న రైతులకు మాఫీ కాకపోవటంతో వారంతా ఇప్పుడు జిల్లా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

3. ఒకే ఆధార్ నంబరుతో చిక్కులు

ఒకే ఆధార్ కార్డు నంబరు ఇద్దరు, ముగ్గురి బ్యాంకు ఖాతాలకు అనుసంధానం కావటంతో అలాంటి వారికి మాఫీ నిధులు జమ కావటం లేదు. బ్యాంకులో ఖాతా తెరిచే సమయంలో ఆధార్ కార్డు లేనివారు తమ కుటుంబ సభ్యులు లేదా సమీప బంధువుల నంబరు ఇవ్వటంతో ఇప్పుడు సమస్యలు తలెత్తుతున్నాయి.

4. సహకార బ్యాంకుల్లో పరిష్కరించే దిశగా..

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని నాలుగు సంఘాల రైతులకు రూ.25 వేల పైన మాఫీ నిధులు జమ కాలేదు. దీనిపై బ్యాంకు అధికారులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సాంకేతిక సమస్యను పరిష్కరించేందుకు యత్నిస్తున్నారు. సహకార రైతులకు సంబంధించిన మాఫీ నిధులను ప్రభుత్వం నేరుగా టెస్కాబ్‌కు జమ చేయడం వల్ల అక్కడి నుంచి డీసీసీబీ ద్వారా సహకార సంఘాల్లోని రైతుల ఖాతాల్లో పడుతున్నాయి. కాస్త జాప్యం జరుగుతున్నప్పటికీ ప్రతి రైతు ఖాతాలో వీటిని జమ చేస్తున్నారు.

# రహదారి విస్తరణలో పైపులైన్ల ధ్వంసం

వాజేడు : జాతీయరహదారి విస్తరణలో మంచినీటి పైపులైన్లను ధ్వంసం చేశారు. అధికారులు పునరుద్ధరణ పనులను విస్మరించారు. మండలపరిధిలోని పెదగొల్లగూడెంలో జాతీయరహదారి సమీపంలోని ఇంట్రా పైపులైను ధ్వంసం కావడంతో గ్రామస్థులకు నెల రోజులుగా తాగునీరందని పరిస్థితి ఏర్పడింది. పైపులను ధ్వంసం చేసిన గుత్తేదారు మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వదిలివేశారు. పగిలిపోయిన పైపుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తానని గుత్తేదారు హామీ ఇచ్చినప్పటికీ పనులను చేపట్టకుండా ఇతర ప్రాంతాలలో పనులను చేసేందుకు వెళ్లడంతో ఇబ్బందులు రెట్టింపయ్యాయి. దూర ప్రాంతాలలోని చేతిపంపు వద్దకు వెళ్లి, బంధువుల ఇళ్లలో మోటార్ల నుంచి తాగునీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గ్రామస్థులు అవస్థలు పడుతున్నా పంచాయతీ పాలకవర్గం స్పందించడం లేదు.

రాకపోకలకు అంతరాయం

రహదారి విస్తరణలో తవ్విన ప్రదేశంలో కంకర నింపకుండా వదిలివేయ



డంతో నీరు నిలిచి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. విషయం పంచాయతీ అధికారులు గుర్తించినా పూడ్చివేసేందుకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు.

రెండు రోజులలో పనులు పూర్తి చేయిస్తాం
–శ్రీనివాస్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

జాతీయ రహదారుల విభాగం అధికారులు పనులను చేపట్టాల్సి ఉంది. ఆ శాఖ అధికారులకు సమాచారం అందించాం. రెండు రోజులలో పనులను పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ఇబ్బందులు తొలగిస్తాం–శ్రీకాంత్‌నాయుడు, ఎంపీవో

రహదారి విస్తరణ పనులలో ప్రజల రాకపోకలకు ఏర్పడిన ఇబ్బందులు తొలగిస్తాం. జాతీయ రహదారి ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి కంకరతో గుంతను నింపేందుకు చర్యలు తీసుకుంటాం.

# మట్టి గణపతికే జై..!

భూపాలపల్లి: సహజ సిద్ధమైన ప్రకృతి ఒడిలో రసాయనాల కాలుష్యం రోజురోజుకు పెరుగుతోంది.. ప్లాస్టిక్ వ్యర్థాలు, ప్రమాదకర వాయువులు పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. చివరికి దేవుడి ప్రతిమలను సైతం రసాయనాలు, కృత్రిమ పదార్థాలతో తయారు చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో జరిగే వినాయక చవితి ఉత్సవాలకు గణనాథులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే వ్యాపారులు కొందరు రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల అమ్మకాలకు సిద్ధం చేస్తున్నారు. భూపాలపల్లి పట్టణంలో కొందరు పర్యావరణహితులు వినాయక విగ్రహాలను మట్టితో తయారు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ మేరకు వినాయక ఉత్సవాలకు శ్రీకారం చుడుతున్న సంఘాలు కూడా మట్టి గణపతుల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తూ.. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు.

ఆకర్షణీయంగా ఆకట్టుకునేలా రంగు రంగుల రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలు పర్యావరణానికి హాని కల్గిస్తాయి. రసాయనాలు నీటిలో కలవడంతో జలచరాలకు ప్రమాదం పొంచి ఉంటుంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారు చేసిన విగ్రహాలు నీటిలో కరిగిపోవడానికి అధిక సమయం పడుతుంది. వీటితో కంటిచూపు మందగించడం, శ్వాసకోశ సమస్యలు, తలనొప్పి వంటి అనారోగ్య సమస్యలు వస్తాయి. రసాయనాలతో నీటిలో ప్రాణవాయువు శాతం తగ్గుతుంది. నీటిలో ఆమ్లశాతం పెరుగుతుంది. ఇటువంటి నీటి వనరులు వినియోగించడంతో నెమ్మదిగా ఆరోగ్యం దెబ్బతింటుంది.

ప్రకృతితో అనుబంధం వినాయకుడికి ప్రకృతికి విడదీయరాని అనుబంధం ఉంది. నలుగుపిండితో ప్రాణం పోసుకున్న గణనాథుడిని ప్రకృతిలో లభించే సహజ సిద్ధమైన మట్టితో పూజించాలి.. మట్టి, పూలు, పత్రి ఆకులంటే వినాయకుడికి ఇష్టం. మట్టికున్న శక్తి, పవిత్రత చాలా గొప్పది.. కలుషితం కానిది. మానవులకే కాదు సకలజీవులకు మంచి చేసేదే మట్టి.. పాత్రలు, మట్టి వస్తువులు, బొమ్మలు మార్కెట్‌లోకి రావాల్సిన అవసరం ఉంది. అత్యంత భారీగా నిర్వహించే వినాయక చవితి వేడుకల్లో ఏకదంతుడి విగ్రహాలన్నింటిని మట్టితోనే తయారు చేసి పూజించాలి.

బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో..నాలుగేళ్ల క్రితం అప్పటి జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కుమ్మర్లకు వారం పాటు మట్టి వినాయక విగ్రహాల తయారీపై శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని పలు మండలాలకు చెందిన 40 మంది కలిసి భూపాలపల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో సుమారు 500 వరకు మట్టి విగ్రహాలు తయారు చేసి, భక్తులకు పంపిణీ చేశారు. శిక్షణ పొందిన కుమ్మర్లు గ్రామీణ ప్రాంతాల్లోనూ మట్టి విగ్రహాలు తయారు చేసి పర్యావరణానికి హాని కలిగించకుండా కృషి చేయాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా మరి కొద్ది రోజుల్లో వినాయక చవితి పండగ ఉన్నందున ఇప్పటి నుంచే మట్టి విగ్రహాలను తయారు చేసి పంపిణీ చేయడానికి సంబంధిత అధికారులు దృష్టి పెడితే బాగుంటుంది. ఎనిమిదేళ్లుగా భూపాలపల్లి ఆర్యవైశ్య సంఘం నాయకులు 500 మట్టి వినాయక విగ్రహాలను ప్రత్యేకంగా తయారు చేయించి పట్టణంలో భక్తులకు ఉచితం పంపిణీ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ ఏడాది కూడా మట్టి విగ్రహాలను తయారు చేయించి ఉచితంగా పంపిణీ చేయడానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు సిద్ధమవుతున్నారు.

18 ఏళ్లుగా తయారీ...రంగుల విగ్రహాలను చూసి చాలా మంది రసాయనాలతో తయారయ్యే విగ్రహాలపై ఆసక్తి చూపిస్తుంటారు. కానీ, జరిగే నష్టాన్ని పసిగట్టలేకపోతున్నారు. పర్వదినం అంటే సమాజానికి మంచిని పంచే ఒక వేదిక. గణపురం మండలం చెల్పూరు గ్రామానికి చెందిన ఎర్రారపు శ్రీనివాస్, ఉమాదేవి దంపతులు 18 ఏళ్లుగా మట్టి గణపతి విగ్రహాలను తయారు చేస్తున్నారు. జిల్లాలోని భూపాలపల్లి, గణపురం, ములుగు జిల్లాలోని మంగపేట, ఏటూరునాగారం మండలాల్లో ఏటా 1500 పైగా మట్టి విగ్రహాలను తయారు చేస్తూ పలు స్వచ్ఛంద సంస్థలకు, కుల సంఘాలకు పంపిణీ చేస్తున్నారు. ఎవరైనా వినాయక చవితి పండగకు నాలుగైదు రోజుల ముందు చెబితే వారి గ్రామాలకు వెళ్లి మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తామని శ్రీనివాస్ దంపతులు తెలిపారు.

యువత అప్రమత్తంగా ఉండాలి..– శ్రీనివాస్, ప్రముఖ వైద్యులు

పర్యావరణానికి హాని కలిగించే ప్రమాదకరమైన రసాయన విగ్రహాల జోలికి వెళ్లకుండా యువత అప్రమత్తంగా ఉండాలి.

# మంజూరు కాని నిధులు..

దామరచర్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూ.30 వేల కోట్ల వ్యయంతో నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం సమీపంలో 4 వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ప్లాంటు నిర్మిస్తుండగా అక్కడికి వెళ్లే రహదారిని మాత్రం పట్టించుకోవడం లేదు. దామరచర్ల నుంచి పవర్‌ప్లాంటు వరకు రహదారి నిర్మాణానికి రూ.150 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ గతేడాది నవంబరు 28న ప్రకటించారు. కానీ నేటి వరకు అమలుకు నోచుకోలేదు. నార్కట్‌పల్లి-అద్దంకి రహదారికి అనుసంధానంగా దామరచర్ల నుంచి టీవీగూడెం మీదుగా పవర్‌ప్లాంటు వరకు 7 కిలోమీటర్ల రహదారిని విస్తరించాల్సి ఉంది. 2015లో పవర్‌ప్లాంటు పనుల ప్రారంభం నుంచి నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. కనీస మరమ్మతులు చేయకపోవడంతో గుంతలతో అధ్వానంగా మారింది. భారీ యంత్రాలను లారీలపై తరలించే లారీలు రైల్వే లైన్ క్రాస్ చేయకుండా ఆంక్షలు విధిస్తున్నారు. ట్రాక్‌పై ఉన్న విద్యుత్తు లైన్లకు తగిలే ఆస్కారం ఉండటంతో నిబంధనలు పాటించాల్సి ఉంది. దీనికితోడు దామర



చర్లలో రహదారి ఇరుకుగా, మూలమలుపులు అధికంగా ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కల్గుతోంది. పవర్‌ప్లాంటు సందర్శనకు సీఎం రాక సందర్భంగా రహదారి విస్తరణకు ఆర్‌అండ్‌బీ అధికారులు అంచనాలు రూపొందించారు. 7 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.150 కోట్లు వ్యయం కాగలదని అంచనా వేసి సీఎంకి అందించారు. దామరచర్లలో రైల్వేలైనుపై రూ.90కోట్లతో ఆర్‌ఓబీ (పైవంతెన), నాలుగు వరుసల సీసీ రహదారి నిర్మాణానికి రూ.60 కోట్ల వ్యయం కానుంది. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడలేదు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ రాంబాబు మాట్లాడుతూ నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపామని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాల్సి ఉందని తెలిపారు.

# ఆర్టీసీకి నూతన చట్టం గుబులు

మిర్యాలగూడ : ఎన్నో ఏళ్లుగా ప్రజలకు రవాణా సాధనంగా ఉపయోగపడిన ఆర్టీసీ బస్సు కరోనా, ఇతర కారణాలతో గ్రామీణ ప్రాంతాల ప్రయాణికులకు దూరమవుతూ వస్తోంది. వచ్చే ఏప్రిల్ ఒకటి నుంచి కేంద్రం తీసుకొస్తున్న 'వాహన చట్టం'తో ఆర్టీసీ బస్సులు ప్రజలకు మరింత దూరమవుతాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నూతన చట్టం ప్రకారం పదిహేనేళ్లు దాటిన బస్సులను తప్పనిసరిగా తుక్కుగా మార్చాలి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల్లో ప్రస్తుతం ఉన్న 387 బస్సుల్లో మరిన్ని తగ్గే ప్రమాదం ఉంది. ఎక్కువ కాలం తిరిగిన బస్సుల్లో డీలక్స్, పల్లెవెలుగు రకాలు ఉండగా.. ఎక్కువ కిలోమీటర్లు తిరిగిన వాటిలో సూపర్ లగ్జరీ బస్సులు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో అనేకం..

ఉమ్మడి జిల్లాలో మొత్తం ఏడు డిపోలు ఉండగా..గత ఏడాది కాలంలో 15 ఏళ్లు దాటిన 44 బస్సులను తుక్కుగా మార్చారు. అయితే అన్ని డిపోల్లోని సూపర్ లగ్జరీ బస్సులు పదేళ్ల దాటడంతో పాటు.. సుమారు 12-13 లక్షల కిలోమీటర్లు దాటాయి. దీంతో వీటిని హైదరాబాద్‌కు పంపించి సిటీ బస్సులుగా మార్పులు చేసి నడిపిస్తున్నారు. అయితే వాటి స్థానంలో కొత్త బస్సులు రావాల్సి ఉన్నప్పటికీ ఆలస్యం అవుతోంది. ఇప్పటి వరకు పాత బస్సుల స్థానంలో మిర్యాలగూడకు 7, కోదాడకు 6, యాదగిరిగుట్టకు 1, దేవరకొండకు 2, నల్గొండకు 2 సూపర్ లగ్జరీ బస్సులు కొత్తవి వచ్చాయి. మరో పల్లె డీలక్స్ బస్సులు సుమారు పన్నెండేళ్లు దాటి.. 14-15 లక్షలకు పైగా కిలోమీటర్లు తిరిగి ఉన్నాయి. వీటిని తుక్కుగా మార్చాల్సిందే. ప్రస్తుతానికి కోదాడ, మిర్యాలగూడ, నల్గొండ డిపోలకు మూడు చొప్పున కొత్త డీలక్స్ బస్సులు రాగా.. వాటి స్థానంలో పాత బస్సులు తుక్కుగా మారుస్తున్నారు. కాగా తుక్కుగా మార్చాల్సిన బస్సులను సైతం మార్పుకుకుండా కొత్తవి వచ్చే వరకు అలాగే నడిపిస్తున్నారు. ఇవన్నీ ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి తుక్కుగా మారనున్నాయి.

తొలుత ప్రభుత్వ వాహనాలు

సురేష్‌రెడ్డి, జిల్లా రవాణా శాఖాధికారి, నల్గొండ

నూతన వాహన చట్టం ప్రకారం తొలుత పదిహేనేళ్లు దాటిన ప్రభుత్వ వాహనాలను తుక్కుగా మార్చనున్నాం. ఇప్పటికే 200 వరకు ప్రభుత్వ వాహనాలను తుక్కుకు తరలించాం. మరో 43 వాహనాలను గుర్తించాం. ఇవన్నీ మార్చి ఒకటో తేదీ వరకు తుక్కుగా మారనున్నాయి. ఆర్టీసీలో 15ఏళ్లు దాటిన బస్సులను మార్చి 31 లోపు తుక్కుకు తరలించేందుకు సంస్థ యాజమాన్యమే నిర్ణయం తీసుకుంది.

# మాటు వేసి.. మాయం చేస్తూ..

నల్గొండ : ఈనెల 11న జిల్లా కేంద్రంలోని హైటెక్ కాలనీకి చెందిన పసునూరు సుధాకర్ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి తిరుపతి వెళ్లి తిరిగి వచ్చి చూసుకునే సరికి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు వస్తువులు, పది తులాల వెండి, రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లారు. పది రోజుల క్రితం దేవరకొండ రోడ్డులోని కనకదుర్గా కాలనీలో వరసగా ఆరు ఇళ్లల్లో గుర్తు తెలియని దుండగులు దొంగతనాలకు పాల్పడ్డారు. రూ.లక్షకు పైగా నగదుతో పాటు నిత్యావసర వస్తువులు సైతం ఎత్తుకెళ్లారు. తిప్పర్తి మండల పరిధిలోని హ్యాపీహోమ్స్ కాలనీలో తాళం వేసి ఉన్న ఏడు ఇళ్లను లక్ష్యంగా చేసుకున్న దుండగులు రెండు తులాల బంగారు వస్తువులు, నగదు, ల్యాప్‌ట్యాప్‌లు వంటి వస్తువులు తీసుకెళ్లారు. కాలనీలో సీసీ కెమెరాలు ఉన్నా దొంగలు తెలివిగా తప్పించుకుని పరారైయ్యారు.

జిల్లా కేంద్రంతో పాటు సమీప ప్రాంతాల్లో కొద్ది రోజులుగా వరస దొంగతనాలతో ప్రజలు బెంబేటలెత్తుతున్నారు. ఇంటికి తాళం వేసి ఉంటే పగలు, రాత్రి తేడా లేకుండా మాటు వేస్తూ.. అందిన కాడికి మాయం చేస్తున్నారు. ఇటీవల ఒక పక్క సైబర్ నేరాలు, మరో పక్క రాత్రి, పగలు దొంగతనాలకు పాల్పడుతూ అన్ని వర్గాల వారిలో నేరస్థులు దడపుట్టిస్తున్నారు. వరస ఘటనలకు పాల్పడుతున్న దుండగులు కరుడు గట్టిన నేరస్థుల పని అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం రాత్రి, పగలు పెట్రోలింగ్ నామమాత్రంగానే నిర్వహిస్తున్నారు. కొంత మంది పోలీస్ సిబ్బంది సామాజిక మాధ్యమాల్లో సూచనలు చేస్తూ చేతులు దులుపుకొంటున్నారు. కొన్ని పోలీస్ స్టేషన్లలో ఉన్నత స్థాయి అధికారులకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని బాధితులు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. రూ.లక్షకు పైగా విలువ చేసే బంగారు, వెండి వస్తువులు పోయినా కేసులు నమోదు చేయడానికి జాప్యం చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు.

గస్తీ పెంచుతున్నాం..- నర్సింహారెడ్డి, డీఎస్పీ

# వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్



జగిత్యాల : ఆయిల్‌పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుండగా ప్రస్తుత బడ్జెట్లోనూ రూ.వెయ్యి కోట్లు కేటాయించి తదుపరి సంవత్సరాల్లో ఈ పంటను మరింతగా విస్తరించాలని నిర్ణయించారు. ఉమ్మడి జిల్లాలో ఒక సీజన్‌లో 9 లక్షల ఎకరాలకుపైగా సాగు విస్తీర్ణం కలిగిన వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్‌ను పేర్కొంటుండగా ఇటీవలేఈ పంట మొక్కలను రైతుల క్షేత్రాల్లో నాటడాన్ని ప్రారంభించారు. గతంలో కోస్తా జిల్లాలకే పరిమితమైన ఆయిల్‌పామ్ మొక్కలను నాలుగు జిల్లాల్లో తొలి విడతలో 1.30 లక్షల ఎకరాల్లో, తదుపరి 1.50 లక్షల ఎకరాల్లో నాటేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకు అనుగుణంగా ఆయిల్‌ఫెడ్ నుంచి అనుమతులు పొందిన కంపెనీలు ఇతర దేశాల నుంచి విత్తనాలను తెప్పించి ఆయా జిల్లాల్లో నర్సరీలను ఏర్పాటుచేసి మొక్కలను పెంచగా ఇటీవలే నాటడం ప్రారంభించారు. ఇప్పటికే 7,500 ఎకరాలకుపైగా రైతులు డీడీలు తీసివ్వగా మార్చిలోపు 13 వేల ఎకరాల్లో మొక్కలు నాట్రనున్నట్లు ఉద్యానశాఖ అధికారులు పేర్కొన్నారు. వరిధాన్యం విక్రయ సమస్యలు, ఆయిల్‌పామ్‌కు వన్యప్రాణులు, కోతుల బెడద లేకపోవటం, చీడపీడల సమస్య అరుదుగా ఉండటం, మార్కెటింగ్ ఇబ్బంది లేకపోవటం, తదితర సానుకూలతలతో ఆయిల్‌పామ్‌ను ప్రత్యామ్నాయ పంటగా భావిస్తున్నారు. ఇందుకు బిందుసేద్యం, మొక్కల రాయితీ, నిర్వహణ ఖర్చు తదితరాలకు హెక్టారుకు రూ.50 వేల వరకు రాయితీని నాలుగేళ్లలో పలురీతులుగా రైతులకు అందిస్తున్నారు. భారత ఆయిల్‌పామ్ పరిశోధనసంస్థ, ఆంధ్రప్రదేశ్‌లోని పెదవేగి ఆయిల్‌పామ్ పరిశోధనస్థానం శాస్త్రవేత్తల బృందం గతంలో పలుమార్లు ఉమ్మడి జిల్లాలో పర్యటించి పరిస్థితులను స్వయంగా పరిశీలించింది. జగిత్యాల పరిశోధనస్థానం నుంచి వాతావరణ నివేదిక, భూగర్భ జలవనరుల శాఖ నుంచి నీటిలభ్యత, ఆయకట్టు, ప్రాజెక్టులనీరు, ఉద్యాన పంటలసాగు వివరాలను శాస్త్రవేత్తలు సేకరించారు. రైతులతో మాట్లాడి పూర్తి వివరాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసిన తరువాత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌పామ్ సాగుకు అనుమతించాయి. పంటను కేంద్ర మద్దతు ధర ప్రకారం కంపెనీలు బైబ్యాక్ పద్ధతిన తీసుకుంటాయి కాబట్టి ప్రభుత్వం అనుమతించిన రైతులే సాగుచేయాలి. నీరు నిలవని నేలలు అత్యంత అనువుగా ఉంటాయి. ప్రస్తుతం అశ్వరావుపేట వద్ద క్రషింగ్ పరిశ్రమలున్నాయి.ఆయిల్‌పామ్ సాగు 2 వేల ఎకరాలను దాటితే క్రషింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో సాగు నిర్దేశిత లక్ష్యాన్ని దాటుతున్నందున ఇప్పట్నుంచి క్రషింగ్ యూనిట్ల నిర్మాణం చేపడితే పంట చేతికందేవరకు పరిశ్రమ సిద్ధమవుతుంది, రైతులకు భరోసా కలుగుతుంది. ఉమ్మడి జిల్లా రైతులకు పరిచయంలేని నూతన పంట కాబట్టి సాగులో ఇబ్బందులు రాకుండా చూడాలి. అంతర పంటలతో రైతులకు ఆదాయ మార్గాలను తెలపాలి. మొక్కలు నాటి కొన్నేళ్లు పెంచిన తరువాత గెలల అమ్మకంలో ఇబ్బంది, ధరలో తగ్గుదల రాకుండా ప్రభుత్వం మధ్యవర్తిత్వంతో కంపెనీలతో దీర్ఘకాలిక ఒప్పంద చర్యలుండాలని రైతులు కోరుతున్నారు.

# ప్రత్యామ్నాయం లేకుంటే... పరేషానే! తెరపైకి



ఇందూరు : ఒకవైపు మాధవనగర్ రైల్వేగేటు మూసివేస్తామని రైల్వే ఇంజినీరింగ్ అధికారులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అతి త్వరలోనే ఈ మేరకు చర్యలు తీసుకుంటే ఆర్యనగర్, వినాయక్‌నగర్, బోర్గాం(పి) వాసులు బైపాస్ మీదుగా పది కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సిందే.మరోవైపు ప్రత్యామ్నాయ మార్గంగా ఉన్న బైపాస్ రోడ్డులో విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా వాహనదారులు నెమ్మదిగా వెళ్లాల్సి రావడంతో ఇప్పటికే వాహనాలు వరుస కడుతున్నాయి. గేటును పూర్తిగా మూసేస్తే వాహన రాకపోకలు మరింత పెరిగి ప్రమాదాలు జరిగే ఆస్కారం లేకపోలేదు.

మాధవనగర్ ఆర్‌ఓబీ నిర్మాణంలో భాగంగా గేటు మూసివేయాల్సిన అవసరం లేకుండానే తాము పనులు ముగిస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రకటించారు. ట్రాక్ పరిధిలో పనులు చేపట్టే సమయంలో సాంకేతికంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గేటు మూసివేయాల్సి ఉంటుందని ఓ అధికారి చెప్పుకొచ్చారు. ద.మ. రైల్వే ఇంజినీరింగ్ విభాగం నుంచి మాత్రం ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.

ఆర్‌యూబీ అనుకున్నా..

గతంలో నిర్ణయం తీసుకొన్న ప్రకారం.. వంతెన నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో గేటు మూసేస్తే తదుపరిగా వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్‌యూబీ(రైల్వే అండర్ వంతెన) ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇది పూర్తి కావాలన్నా గేటును కొద్ది రోజుల పాటు మూసివేయక తప్పదు.

10 కి.మీ. ఎక్కువ తిరగాలి

నేను నిత్యం డిచ్‌పల్లి నుంచి ఆర్యనగర్‌కు ఉద్యోగం కోసం వెళ్తుంటా. రైల్వే గేటు మూసేస్తే ఇబ్బందులు తప్పవు. ప్రత్యామ్నాయంగా ఉన్న ఆర్‌యూబీ రాకపోకలకు వీలుగా లేదు. ఎప్పుడూ అక్కడ నీరు నిలిచి ఉంటోంది. బైపాస్ మీదుగా వెళ్తే అదనంగా 10 కి.మీ. ప్రయాణభారం తప్పదు.

రాజు, ప్రైవేటు ఉద్యోగి

ఆ మార్గం బాగు చేస్తే..

ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలు వెళ్లేందుకు వీలుగా మాధవనగర్ నుంచి బైపాస్‌కు నేరుగా అడ్డదారి ఉంది. ఈ మార్గంలో ఉన్న ఆర్‌యూబీలో మూడు కాలాలూ మోకాలు లోతు బురద ఉంటోంది. ఫలితంగా వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇందులో నిలిచిన నీటిని మళ్లించే సదుపాయం ఉన్నా నిర్మాణ లోపంతో పూడిక చేరి ఉపయోగం లేకుండా పోయింది.రెండు కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డు ఇరుకుగా ఉంది. ఎదురెదురుగా వాహనాలు వస్తే ముందుకు వెళ్లడం కష్టం. గ్రామం వైపు సీసీ దారి ఉన్నా.. దానికి ఇరువైపులా మట్టి లేకపోవడంతో వాహనాలను రోడ్డు దించితే పల్టీ కొట్టడం ఖాయం. ఆర్‌యూబీకి మరోవైపు ఉన్న మార్గం పూర్తిగా గుంతలతో కూడిన మట్టిరోడ్డు ఉంది. దీనికి ఇరువైపులా ముళ్లపొదలు, పంటకాల్వలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ సమస్యలను పరిష్కరించి మార్గం సుగమం చేస్తే వాహనదారులకు ఉపశమనం కలగనుంది.

# సీఎంఆర్ పూర్తయ్యేనా..?

కామారెడ్డి : సీఎంఆర్ సేకరణ ఆలస్యమవుతోంది. కేంద్రం రెండు, మూడుమార్లు గడువు పొడిగించినప్పటికీ మిల్లింగ్‌లో వేగం కనిపించడం లేదు. 2021-22 నుంచి 2022-23 వానాకాలం వరకు మూడు సీజన్లలో ఒక్కటి కూడా లక్ష్యాన్ని చేరలేదు. మొన్నటి సీజన్‌కు సంబంధించి ఇంకా 65,496 క్వింటాళ్ల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది. అధికారులు రోజువారీ లక్ష్యాలు నిర్దేశించినప్పటికీ మిల్లింగ్ నత్తను తలపిస్తోంది. జిల్లావ్యాప్తంగా గత యాసంగి సీజన్‌లో 2.78 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. వీటిని ఆయా మిల్లులకు కేటాయించారు. ఈ మేరకు 1.88 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటి వరకు 97,716 వేల మె.ట. మాత్రమే ఇచ్చారు. గత వానాకాలం సీజన్‌కు సంబంధించి మిల్లింగ్ ఇప్పుడిప్పుడే ప్రారంభించారు. జాప్యం చేస్తున్న 29 మిల్లులకు అధికారులు తాఖీదులు జారీ చేసినా పరిస్థితిలో మార్పురావడం లేదు.

పూర్తయిందని బుకాయింపు

మిల్లులు ధాన్యం తీసుకుని అటుఇటుగా ఏడాది గడుస్తోంది. కరోనా సమయంలో హమాలీల కొరత ఉందని జాప్యం చేశారు. ప్రస్తుతం అంతా బాగానే ఉన్నా మిల్లింగ్‌లో వేగం పెంచడంలేదు. మొన్నటి వానాకాలం సీజన్ ధాన్యం శతశాతం పూర్తయిందని పేర్కొన్నారు. ఇంకా పెండింగులో ఉందని పౌరసరఫరాలశాఖ కొత్త డీఎం వచ్చాకే తెలిసింది.

ప్రత్యేక దృష్టి

సీఎంఆర్‌పై కలెక్టర్ జితేశ్ వి పాటిల్ గతేడాది ప్రత్యేక దృష్టి పెట్టారు. తహసీల్దారు, ఉప తహసీల్దారుకు బాధ్యతలు అప్పగించారు. ప్రతి మిల్లు రోజు వారీ లక్ష్యాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్వయంగా మిల్లులు తిరిగి వివరాలు తెలుసుకున్నారు. పౌరసరఫరాలశాఖ అధికారులతో సమీక్షించారు. 80 శాతం మిల్లింగ్ పూర్తి చేసిన యజమానులను సన్మానించారు. గతంలో మాదిరిగా చర్యలు తీసుకుంటేనే సీఎంఆర్ పూర్తయ్యేలా కనిపిస్తోంది. ఎందుకంటే మరో రెండు నెలల్లో ఈ ఏడాది యాసంగి సీజన్ ధాన్యం రాబోతుంది. అప్పటి వరకు పూర్తయితేనే వాటిని నిలువ చేయడానికి స్థలం ఉంటుంది.త్వరగా పూర్తి చేయాలిమిల్లర్లకు ఇచ్చిన లక్ష్యాల ప్రకారం సీఎంఆర్‌ను త్వరగా పూర్తి చేయాలి. గత వానాకాలం, యాసంగి సీజన్ల మిల్లింగ్ వెంటనే ముగించాలి. నిర్ణీత గడువులోగా లక్ష్యాలు పూర్తి చేయడంపై మిల్లర్లు దృష్టి సారించాలి.

# గన్నారం గుట్టను తవ్వేశారు

నిజామాబాద్ : 44వ నంబరు జాతీయ రహదారికి కిలోమీటరు దూరంలోని గుట్టను తొలిచారు. పదిరోజులుగా చెట్లను నరికి యంత్రాలతో భూమిని చదును చేశారు. సాగుకు అనుకూలంగా మార్చే క్రమంలో బోరు కూడా వేయించారు. విద్యుత్తు స్తంభాలు.. హద్దురాళ్లు పాతే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇందల్‌వాయి మండలం గన్నారం సమీపంలోని అటవీ భూమిలో జరుగుతున్న ఈ కబ్జా వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. రెవెన్యూ, అటవీశాఖల మధ్య సమన్వయం లేకపోవటాన్ని కొందరు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఈ అక్రమం వెనుక వారే ఉన్నట్లుగా ప్రచారం సాగుతోంది. భూమి ఇదివరకే అటవీశాఖకు ఇచ్చేశామంటూ తహసీల్దార్ చెబుతుంటే, అప్పగింత ప్రక్రియ పూర్తి కాలేదని అటవీశాఖ రేంజ్ అధికారి చెప్పటం గమనార్హం. మాది కాదంటే.. మాది కాదంటూ ఇరుశాఖల అధికారులు చేతులెత్తేయటం అక్రమార్కులకు అనువుగా మారింది.

పట్టింపులేక.. పరులపాలు

సిరికొండ మండలంలోని కప్పలవాగు, చంద్రాయన్‌పల్లి పరిధిలోని చెన్నరాయి చెరువు, రూప్లనాయక్‌తండా పరిధిలోని జోర్నాత్ చెరువు, ఎర్రకుంట ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి పనుల్లో అటవీభూమిని వినియోగించారు. ఇందుకు బదులుగా రాష్ట్ర ప్రభుత్వం అటవీశాఖకు మరోచోట భూమి అప్పగించాల్సి ఉంది. ఈ క్రమంలోనే ఇందల్‌వాయి మండలం గన్నారం శివారులో భూమి కేటాయించింది. మొత్తం 254.24 ఎకరాలు ఉండగా 228.22 ఎకరాలను అటవీశాఖకు అప్పగించారు. ఈ మేరకు 2001 జనవరిలో అప్పటి జిల్లా కలెక్టర్ కామారెడ్డి అటవీ డివిజనల్ అధికారికి ఉత్తర్వులిచ్చారు. అయితే 35 ఎకరాలకు గతంలో రైతులకు పట్టాలు జారీ అయ్యాయి. దీంతో అటవీశాఖకు కేటాయించిన భూమిలో కొన్ని ఎకరాలు తగ్గాయి. ఆ తర్వాత ఈ భూమి విషయంలో రెండు శాఖలు చర్చించుకోలేదు. 2020లో రెవెన్యూ, అటవీశాఖలు జరిపిన సంయుక్త సర్వే సందర్భంలో 60 ఎకరాల్లో రైతులు సాగులో ఉన్నట్లు గుర్తించారు. కానీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. తర్వాత అయినా అన్యాక్రాంతం కాకుండా జాగ్రత్త పడలేదు.

30 ఎకరాల మేర..

పోడుభూముల్లో సాగులో ఉన్నవారికి హక్కు పట్టాల జారీకి కసరత్తు జరుగుతోంది. ఇదే సందర్భంలో అటవీభూమిపై కొందరు కన్నేశారు. ఇక్కడ గుట్ట ప్రాంతంగా ఉన్న భూమిని చదును చేయించి.. 2005 డిసెంబరు ముందు నుంచి కబ్జాలో ఉన్నట్లు ఆధారాలు సృష్టించాలనేది అక్రమార్కుల ఆలోచనగా తెలుస్తోంది. సుమారు 30 ఎకరాలకు పైగా విస్తీర్ణంలోని చెట్లను నరికించేసి.. బండరాళ్లను తొలగించారు. జేసీబీలు పెట్టి భూమిని చదును చేసి వ్యవసాయానికి అనుకూలంగా మారుస్తున్నారు. ఈ విషయాన్ని స్థానికులు ఇటు రెవెన్యూ, అటు అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కానీ వారి నుంచి స్పందన లేదు. అటవీ ప్రాంతంలో చెట్లు నరికితేనే కేసులు నమోదు చేసే అధికారులు.. తవ్వకాలు చేపట్టి చదును చేస్తుంటే చోద్యం చూడటం విడ్డూరంగా ఉంది. కొందరు మరోసారి తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లటంతో మంగళవారం సిబ్బందిని పంపి పనులు ఆపివేయించారు.

గతంలోనే అటవీశాఖకు ఇచ్చేశాం- చంద్రశేఖర్, అదనపు కలెక్టర్

సంబంధిత భూమిని గతంలోనే అటవీశాఖకు కేటాయించాం. హద్దులు చూయించాం. పరిరక్షణ బాధ్యత ఆ శాఖదే ఉండాలి. ఇదే విషయాన్ని డీఎఫ్‌వో, ఎఫ్ఆర్వోకు కూడా చెప్పాం. మా శాఖపరంగా సహకారం కావాలంటే అందిస్తాం. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.

ఆక్రమణను అడ్డుకుంటాం- వికాస్, అటవీశాఖ జిల్లా అధికారి

ఇందల్‌వాయి మండలం గన్నారం సమీపంలో అటవీభూమి ఆక్రమణ చర్యలను అడ్డుకుంటాం. సంబంధిత ప్రాంతం రెవెన్యూశాఖ.. తమ శాఖకు అప్పగించిందేనా అనే విషయాన్ని నిర్ధారించుకుంటాం. ఆ తర్వాత ఆక్రమణకు ప్రయత్నించిన వారిపై కేసులు నమోదు చేస్తాం. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం.

# చిగురించిన పోడు ఆశలు

కామారెడ్డి : అటవీ భూమిని సాగు చేసుకుంటూ దశాబ్దాలుగా హక్కుపత్రాల కోసం నిరీక్షిస్తున్న వారి ఆశలు త్వరలో నెరవేరబోతున్నాయి. అర్హులకు ఈ నెలలోనే జారీ చేసేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే దరఖాస్తులపై గ్రామ, సబ్ డివిజన్ స్థాయి కమిటీల సమావేశాలు నిర్వహించి అర్హుల జాబితాలు రూపొందించారు. నిబంధనలకు అనుగుణంగా లేని దరఖాస్తులు భారీగా తిరస్కరణకు గురయ్యాయి. జిల్లావ్యాప్తంగా కేవలం పదుల సంఖ్యలో మాత్రమే పరిగణనలోకి తీసుకొని జిల్లా కమిటీకి నివేదించారు. వీటిని మరోసారి పరిశీలించి అర్హమైన వాటికి ఆమోద ముద్ర వేయాలంటూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో సబ్ డివిజన్ స్థాయి కమిటీలు నిమగ్నమయ్యాయి. నాలుగు రోజులుగా దరఖాస్తులన్నింటిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో ఈ తంతును పూర్తి చేసి జిల్లా కమిటీకి సమర్పించేందుకు ఆర్డీవోలు కసరత్తు చేస్తున్నారు.

వారివి పెండింగ్‌లోనే..జిల్లాలో పోడు రైతులకు హక్కుపత్రాలు ఇచ్చేందుకు ప్రభుత్వం గిరిజనులు, గిరిజనేతరుల నుంచి దరఖాస్తులు తీసుకుంది. అటవీ హక్కు చట్టం-2006 మొదటగా గిరిజనుల అర్జీలను మాత్రమే పరిశీలిస్తున్నారు. ఇతరులవి ప్రస్తుతానికి పెండింగులో పెట్టారు.

అర్హులు స్వల్పమే..జిల్లావ్యాప్తంగా మొత్తం 27,075 మంది దరఖాస్తు చేయగా ఇందులో గిరిజనేతరులే సగానికిపైగా ఉన్నారు. పరిశీలన ప్రక్రియలో శాస్త్రీయ ఆధారాల ద్వారానే అర్హులను గుర్తించే పని మొదలుపెట్టారు. ప్రాథమిక ఆధారాలుగా ఉపగ్రహ(శాటిలైట్) చిత్రాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఈ లెక్కన జిల్లాలో చాలా మంది దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ఇప్పటి వరకు కేవలం 725 మంది మాత్రమే అర్హులుగా తేలినట్లు సమాచారం. సబ్ డివిజన్ స్థాయిలో పరిశీలన ప్రక్రియ తుది దశకు చేరుకుంది.

మరోసారి వడబోత

రాష్ట్రవ్యాప్తంగా అర్హుల సంఖ్య తక్కువగా ఉండటంతో మరోసారి దరఖాస్తులు పరిశీలించి అర్హమైనవి గుర్తించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. మొదట జిల్లావ్యాప్తంగా కేవలం 112 దరఖాస్తులు మాత్రమే సరైనవిగా తేల్చారు. రెండోసారి పరిశీలనలో 725కు చేరింది. ప్రస్తుతం బాన్సువాడలో దరఖాస్తుల పరిశీలన తుది దశకు చేరుకోగా.. కామారెడ్డిలో పూర్తయింది. ఎల్లారెడ్డి డివిజన్‌లో మరో రెండు రోజుల్లో పూర్తయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.తుది దశకు వచ్చింది- అంబాజీ, గిరిజన సంక్షేమాధికారి, కామారెడ్డిపోడు దరఖాస్తుల పరిశీలన తుది దశకు చేరుకుంది. అర్హమైన వాటిని గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. తరువాత జిల్లా కమిటీ ఆధ్వర్యంలోనే హక్కుపత్రాల జారీ ఉంటుంది. ఆర్డీవోలు, ఎంపీడీవోలకు కలెక్టర్ మార్గదర్శనం చేశారు.

## కళాకారుల ధర్మంపై తత్వం భోధించిన కంగన

కొందరిలో తాత్వికత పుట్టుకతోనే అబ్బుతుంది. బ్లడ్ లో అది ఉంటుంది. కానీ మరికొందరిలో మధ్యలో ప్రవేశిస్తుంది. ఈ రెండో కేటగిరీకే చెందుతుంది క్వీన్ కంగన. కమర్షియల్ సినిమాల నాయికగా కొనసాగిన రోజుల్లో, స్టార్ హీరోలతో స్నేహం చేసిన రోజుల్లో ఎలాంటి తత్వాన్ని భోధించేందుకు సాహసించని కంగన ఇటీవలి కాలంలో రూటు మార్చి తత్వాన్ని భోధిస్తోంది. ఇటీవలే కృష్ణ తత్వాన్ని భోధించింది. హరేకృష్ణ నామజపం చేస్తూ ఒక హీరోని కించపరుస్తూ మాట్లాడింది. ఇంతలోనే ఇప్పుడు కళాకారుని గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది కంగన. ఈ భామ తన ఇన్‌స్టాలో తన అభిమానుల కోసం స్ఫూర్తి నింపే నోట్ ని షేర్ చేసింది. నమ్మశక్యం కాని వాటిని నమ్మే గొప్ప కళాకారుల గురించి కంగన గొంతెత్తింది. ఇన్ స్టా పోస్ట్ లో కంగనా ఏమని రాసింది అంటే..! “మనం మన హృదయాన్ని ఎంత ఎక్కువగా అనుసరిస్తామో.. మనం చేయాలనుకున్నది ఎంతగా చేస్తామో కదా! అయినా మనం ఏ దిశలో వెళ్లినా మన విధిని చేరుకోవడానికి డెస్టినీ ముందే నిర్ణయమైందని మనం గ్రహిస్తాము. కాబట్టి ఈ కార్యాచరణ అంతా ఏమిటి? కచ్చితంగా వీటన్నింటికీ ఒక పాయింట్ ఉంది. ఈ అంతులేని పాయింట్ల మాతృక లేకుండా



ప్రారంభించాల్సిన పని లేదని ఎప్పటికీ గుర్తించలేరు” అని తాత్వికంగా మాట్లాడింది. ఒకానొక సమయంలో ఇళ్లు, బట్టలు, ఉద్యోగాలు, వ్యక్తులు, అన్ని రకాల అనుభవాలు చాలా ముఖ్యమైనవిగా అనిపించేవి. తర్వాతి మలుపులో అవన్నీ అనవసరంగా మారతాయి. అయితే మనం మరింత ఎక్కువగా ఆశిస్తూ, ప్రార్థిస్తూ ఇంకా ఇంకా కోరుతూనే ఉంటాము. ఈ చక్రం ఎక్కడో మొదలవుతుంది. పునరావృతం అయినప్పుడు అదే చక్రం రిపీటైందని స్పష్టంగా చెప్పగలం. కాబట్టి వీటన్నింటి ప్రయోజనం ఏమిటి? అదే షో రిపీటెడ్‌గా ఉంది.., ఇలాంటప్పుడు మనిషి ఏం చేయాలి?” అని నోట్ లో ప్రశ్నించింది. అంతిమంగా కళాకారులకు అద్భుత సలహా కూడా ఇచ్చింది కంగన. “పై ప్రశ్నకు సమాధానం ఏమిటంటే, మొదటి సారి లేదా ప్రతిసారీ అదే ప్రదర్శన అయినప్పటికీ కళాకారులు దానిని పరిపూర్ణంగా ప్రదర్శించాలి. గొప్ప కళాకారులు చేసేది అదే.. వారు నమ్మశక్యం కాని వాటిని నమ్ముతారు” అని తెలిపింది. అంతేకాదు కళాకారులందరికీ మంచి జరగాలని కోరుకుంది క్వీన్. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. కంగనా తదుపరి ‘చంద్రముఖి 2’లో కనిపించనుంది. ఇది సెప్టెంబర్ 19న విడుదల కానుంది. ఇందిరా గాంధీ పాత్రను పోషిస్తున్న ‘ఎమర్జెన్సీ’ కూడా విడుదల కావాల్సి ఉంది. ఈ చిత్రాన్ని కంగన స్వీయ నిర్మాణ దర్శకత్వంలో తెరకెక్కిస్తోంది. దీనికోసం తన ఆస్తులన్నిటినీ తాకట్టు కూడా పెట్టింది. కంగన ‘తేజస్’ అనే చిత్రంలోను నటిస్తోంది. ఈ చిత్రంలో ఎయిర్ ఫోర్స్ పైలట్ పాత్రలో కనిపించనుంది.

## సమంత కూడా రేణుదేశాయ్ పరిస్థితుల్లోనేనా?

పవన్ కళ్యాణ్ తో విడిపోయిన తర్వాత రేణు దేశాయ్ సోషల్ మీడియాలో అభిమానుల కారణంగా ట్రోలింగ్ ఎదుర్కోన్న సంగతి తెలిసిందే. అప్పటివరకూ వదినమ్మ అంటూ ఎంతో అభిమానంతో పిలుచుకునే వారంతా ఒక్కసారిగా రేణు దేశాయ్ పై తిరగబడ్డారు. తపంతా తనదే అన్నట్లు దూషించారు. ఈ విషయాన్ని రేణు దేశాయ్ పబ్లిక్ గానే వెల్లడించింది. ఇప్పటికీ పవన్ అభిమానుల నుంచి విమర్శలు ఎదుర్కుంటూనే ఉంది. పవన్ పట్ల సానుకూలంగా మాట్లాడితే ఒకే లేదంటే? ఎటాకింగ్ తప్పదు. విడిపోయి ఎవరి జీవితాలు వారు గడుపుతున్నా! రేణు దేశాయ్ ఇన్ స్టాలో ఫోటోలు షేర్ చేస్తే విమర్శలు ఎదుర్కోవాల్సిందే. తాజాగా సమంత కూడా అదే పరిస్థితుల్లో ఉన్నట్లు కనిపిస్తుంది. నాగచైతన్యతో విడిపోయిన



తర్వాత సామ్ తన జీవితంలో తాను బిజీ అయింది. తనకు నచ్చిన విధంగా స్వేచ్ఛా జీవితం గడుపుతుంది. ఇటీవలే ఆమె నటించి ఖుషీ రిలీజ్ అయింది. అందులో విజయ్ దేవరకొండతో కొన్ని రొమాంటిక్ సన్నివేశాల్లో నటించింది. భార్య పాత్ర పోషించింది. ఆలుమగల ధాంపత్య జీవితాన్ని సినిమాలో బాగానే హైలైట్ చేసారు. అయితే ఇదే సమంతపై చైతన్య అభిమానులు నిప్పులు కురిపించేలా చేసింది. విజయ్ తో రొమాంటిక్ సన్నివేశాల్లో నటించడం పట్ల చైతన్య అభిమానులు హర్ట్ అయినట్లు సోషల్ మీడియా కామెంట్లు చెబుతున్నాయి. అభిమానుల మనసులు నొచ్చుకునేలా సమంత నటిస్తుందంటూ కామెంట్లు పెడుతున్నారు. దీంతో ఇది ఎంతవరకూ సమజసం అంటూ కొన్ని రకాల విశ్లేషణలు తెరపైకి వస్తున్నాయి. ఇప్పుడు అక్కినేని ఫ్యామిలీతో సమంతకి ఎలాంటి సంబంధాలు లేవు. చైతన్య తో విడాకులతో వేరైంది. ఎవరి జీవితాలు వారు గుడుపుతున్నారు. అయినా సమంతని ఇంకా అక్కినేని ఇంట కోడలిగానే కొంత మంది అభిమానులు భావించి ఇలా నటించకూడదంటూ ఆక్షలు విధించడం ఆసక్తికరం. ఈ విషయంలో కొంత మంది కళ్లు తెరిచి వాస్తవాలు గ్రహించాల్సిన అవసరం ఉందంటూ సమంత మద్దతుదారులు కోరుతున్నారు.





## ఎన్టీఆర్ హై వోల్టేజ్ యాక్షన్.. నీళ్ళల్లో అన్ని రోజులా?



జూనియర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వం లో దేవర మూవీ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా మూవీగా ఈ సినిమాని నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తూ ఉండగా, సైఫ్ అలీఖాన్ పవర్ ఫుల్ ప్రతినాయకుడిగా చిత్రంలో కనిపిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ కొత్త షెడ్యూల్ ని కొరటాల శివ మళ్ళీ స్టార్ట్ చేశారు. ప్రారంభం నుంచి కొరటాల శివ ఎక్కువగా యాక్షన్ సీక్వెన్స్ కంప్లీట్ చేయడంపైన ఫోకస్ పెట్టారు. అందులో భాగంగా మొదటి షెడ్యూల్ లోనే షిప్ ఫైట్ ని చిత్రీకరించారు. తాజాగా సినిమాలో కీలకంగా ఉండే మరో భారీ యాక్షన్ సీక్వెన్స్ ని స్టార్ట్ చేశారంట. పూర్తిగా వాటర్ లో సాగే ఈ ఫైట్ సీక్వెన్స్ మూవీ మొత్తానికి హైలైట్ గా ఉంటుందంట. యాక్షన్ కొరియోగ్రఫర్ కింగ్ సోలొమన్ ఈ సీక్వెన్స్ ని డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ వాటర్ ఫైట్ సీన్ ని ఏకంగా 20 రోజుల పాటు తెరకెక్కించనున్నారంట. పెర్ఫెక్షన్ కోసం తారక్ కూడా ఇప్పటికే నిపుణులైన వారి నుంచి మూడు రోజుల పాటు శిక్షణ కూడా తీసుకుంటున్నాడంట. ఆ తరువాత ఈ యాక్షన్ సీక్వెన్స్ షూటింగ్ స్టార్ట్ చేస్తారంట. ప్రస్తుతం ఈ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మొత్తానికి జూనియర్ ఎన్టీఆర్ ఏకంగా 20 రోజుల పాటు దేవర మూవీ కోసం వాటర్ లోనే ఎక్కువ టైం స్పెండ్ చేయాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఇప్పటికే దేవర సినిమాపై ఎక్స్ పెక్టేషన్స్ పీక్ లో ఉన్నాయి. నవంబర్ ఆఖరుకి మూవీ షూటింగ్ కి గుమ్మడికాయ కొట్టేసి పోస్ట్ ప్రొడక్షన్ కి వెళ్లిపోవాలని కొరటాల ప్లాన్ చేస్తున్నారు. నెక్స్ట్ హిందీలో వార్ 2 సినిమా షూటింగ్ లో తారక్ జాయిన్ అవ్వాల్సి ఉంటుంది. అది పూర్తిచేసుకొని వచ్చే ఏడాది ప్రశాంత్ నీల్ సినిమాని సెట్స్ పైకి తీసుకొని వెళ్ళాలి. ఇలా వరుసగా పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ పెట్టుకోవడం వలన దేవరపైన తారక్ ప్రస్తుతం పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టారు. ఈ చిత్రంతో సోలోగా పాన్ ఇండియా స్థాయిలో బ్లాక్ బస్టర్ కొట్టి తన బ్రాండ్ ని ఎస్టాబ్లిష్ చేసుకోవాలని జూనియర్ ఎన్టీఆర్ భావిస్తున్నారు.

## చిన్న గౌనులో చిలిపి నవ్వుతో ప్రగ్యా



టాలీవుడ్ మోస్ట్ గ్లామరస్ బ్యూటీగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్న అందాల భామ ప్రగ్యా జైశ్వాల్. ఈ బ్యూటీ మిర్చిలాంటి కుర్రాడు సినిమాతో టాలీవుడ్ లోకి హీరోయిన్ గా అడుగుపెట్టింది. వరుణ్ తేజ్ తో చేసిన కంచె మూవీ ప్రగ్యాకి నటిగా మంచి గుర్తింపు తీసుకొచ్చింది. అయితే తరువాత ఆమెకి మళ్ళీ ఆ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చే పాత్రలు పడలేదని చెప్పాలి. ఎక్కువగా గ్లామర్ రోల్స్ కి పరిమితం అయ్యింది. మనోజ్ తో గుంటూరోడు, నక్షత్రం, జయ జానకి నాయకా, ఆచారి అమెరికా యాత్ర లాంటి సినిమాలలో ప్రగ్యా జైశ్వాల్ హీరోయిన్ గా నటించింది. అయితే ఇవేవీ కూడా ఆమెకి సక్సెస్ ని అందించలేదు. చివరిగా బాలకృష్ణకి జోడీగా అఖండ సినిమాలో ప్రగ్యా జైశ్వాల్ నటించింది. ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. అయితే హీరోయిన్ గా ప్రగ్యా జైశ్వాల్ కెరియర్ కి మాత్రం ఏ విధంగా ఉపయోగపడటం లేదు. ప్రస్తుతం చేతిలో చెప్పుకోదగ్గ ఆఫర్స్ అయితే లేవు. కానీ ఈ బ్యూటీ సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది. ముఖ్యంగా ఇన్ స్టాగ్రామ్ లో రెగ్యులర్ గా తన హాట్ ఫోటోలని షేర్ చేస్తూ ఉంటుంది. ఈ ఫోటోలని లక్షల్లో నెటిజన్లు చూస్తూ ఉంటారు. ఎలాంటి సంకోచం లేకుండా హాట్ హాట్ కాస్ట్యూమ్స్ తో ప్రగ్యా జైశ్వాల్ కుర్రకారుకి వినోదం అందిస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి అదిరిపోయే ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో సందడి చేస్తోంది. వైట్ కలర్ షార్ట్ స్కర్ట్ వేసుకున్న ఈ అమ్మడు థైస్ అందాలు చూపిస్తూ చిలిపి చిరునవ్వుతో కుర్రాళ్ళ మనసులు కొల్లగొడుతోంది. కవ్వించే అందాలతో కనువిందు చేస్తోన్న ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ మధ్య గ్లామర్ బ్యూటీస్ అందరికి కూడా ఇన్ స్టాగ్రామ్ ఫోటోషూట్ లకి వేదికగా మారిపోయింది. చాలా మంది దర్శకులు క్యాస్టింగ్ సెలక్షన్ కూడా ఇన్ స్టాగ్రామ్ లో ఫోటోలని చూసినా చేసుకుంటున్నారు. ఇక ప్రగ్యా జైశ్వాల్ విషయానికి వస్తే తెలుగులో ఛాన్స్ లు తగ్గడంతో బాలీవుడ్ పై ఫోకస్ పెట్టింది. అక్కడ డిజిటల్ ఎంట్రీ ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉంది. మరి ప్రగ్యాకి బ్రేక్ ఇచ్చే ఛాన్స్ లు ఏమైనా వస్తాయేమో చూడాలి.

## సమంతను పట్టుకొని అంత మాట అన్నాడా..?

టాలీవుడ్ స్టార్ హీరోయిన్లలో సమంత ఒకరు. ఆమెకు కేవలం తెలుగులోనే కాకుండా, దక్షిణాదిన విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఫ్యామిలీ మేన్ 2 వెబ్ సిరీస్ తర్వాత ఆమెకు నార్త్ లోనే ఫాలోయింగ్ కూడా పెరిగిపోయింది. అందుకే ఆమెకు ఇప్పటికీ వరస ఆఫర్లు వస్తున్నాయి. రీసెంట్ గా ఆమె విజయ్ దేవర కొండతో కలిసి కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్ ట్రైనర్ ఖుషీతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమా పాజిటివ్ టాక్ తో దూసుకుపోతోంది. అయితే, ఈ మూవీ ప్రమోషన్స్ ఇండియాలో పూర్తి చేసిన తర్వాత సమంత అమెరికా వెళ్లారు. నిజానికి చికిత్స నిమిత్తం ఆమె అమెరికా వెళ్లారు. అయితే, పనిలో పనిగా ఆమెను మూవీ టీమ్ ప్రమోషన్స్ చేయమని కోరారు. దీంతో, అమెరికాలో ఉన్న ఇండియన్స్ తో గ్రీట్, మీట్ ఈవెంట్ లో పాల్గొన్నారు. ఆ ఈవెంట్ లో పాల్గొన్నందుకు



సమంతకు 25వేల డాలర్లు చెల్లించారు. రూల్స్ ప్రకారం ఆమె దాదాపు రెండు గంటలు ఈ ప్రోగ్రామ్ లో పాల్గొనాలి. అయితే, కేవలం గంటన్నర ప్రోగ్రామ్ లో ఉండి, ఆ తర్వాత వెళ్లిపోయిందట. అయితే, సమంత లగేజ్ బాధ్యత అంతా ఆమె మేనేజర్ తీసుకున్నారు. సమంత కారు వెనక ఈ లగేజ్ ఉన్న కారు వెళ్లాల్సి ఉండగా, దానిని ఈవెంట్ ఆర్గనైజర్లు దాదాపు గంటపాటు నిలిపివేశారు. ఆ తర్వాత ఆ కారును కూడా వెళ్లనిచ్చారు. అయితే, సమంత వెళ్తున్న కారు డ్రైవర్ కి ఫోన్ చేసిన ఈవెంట్ మేనేజర్ ఆమెను ఓ బూతు పదంతో తిట్టాడట. ఆ సమయంలో కారులో బ్లూటూత్ ఆన్ లో ఉండటంతో, ఆ మాట సమంత చెవిన కూడా పడింది. ఆ మాట విని ఆమె చాలా బాధపడినట్లు తెలుస్తోంది. అయినా కూడా, ఆ విషయంలో ఆమె ఎవరికీ ఫిర్యాదు చేయలేదని సమచారం. డబ్బులు తీసుకొని, చెప్పిన సమయం వరకు ఉండలేదనే అతను తిట్టినట్లు తెలుస్తోంది. అయినా కూడా అలా బూతులు తిట్టడం కరెక్ట్ కాదు కదా అనే అభిప్రాయం వ్యక్తమౌతుంది. కానీ, సమంత ఎంత బాధపడినా, ఈ విషయాన్ని పెద్దది చేయాలని అనుకోకపోవడం విశేషం. ఇక, ఇక, ఈ మూవీ సెప్టెంబర్ 1వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చింది. శివ నిర్వాణ దర్శకత్వం వహించారు. కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్ ట్రైనర్. ఈ మూవీ లో సమంత, విజయ్ ల నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఫ్యాన్స్ కి మాత్రం విపరీతంగా నచ్చేస్తోంది.

## మ్యారేజ్ పై మాట మార్చేసిన తమన్నా..!

మిల్కీ బ్యూటీ తమన్నా సక్సెస్ ఫుల్ గా 18 ఏళ్లు కెరీర్ పూర్తి చేసుకుంది. చాంద్ సా రోషన్ చెహ్రా అనే హిందీ సినిమాతో తెరంగేట్రం చేసిన తమన్నా శ్రీ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. అప్పటి నుంచి వచ్చిన ప్రతి అవకాశాన్ని వాడుకుంటూ స్టార్ స్టేటస్ అందుకుంది. ముఖ్యంగా టాలీవుడ్ స్టార్ హీరోలందరితో నటించిన తమన్నా తెలుగుతో పాటుగా తమిళ భాషలో కూడా సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. 18 ఏళ్లు కెరీర్ తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని చెబుతుంది తమన్నా. రీసెంట్ గా పాల్గొన్న ఇంటర్వ్యూలో తన సినీ కెరీర్ ఎంతో సంతోషకరంగా ఉందని అన్నది తమన్నా. రజినీకాంత్ తో జైలర్ సినిమాలో నువ్వు కావాలయ్యా పాట తమన్నాని తిరిగి ఫాం లోకి వచ్చేలా చేసింది. నేషనల్ లెవెల్ లో ఈ సాంగ్ సెన్సేషన సృష్టించింది. ఆ సినిమా హిట్ లో కూడా అది భాగమైంది. జైలర్ తో తమన్నా కెరీర్ జోష్ అందుకుంది. కెరీర్ గ్రాఫ్ పడిపోతుంది



అనుకుంటున్న ప్రతిసారి తమన్నాకి ఇలాంటి ఛాన్స్ లే వస్తుంటాయి. జైలర్ తర్వాత తమన్నాకు మళ్లీ వరుస అవకాశాలు వస్తున్నాయని తెలుస్తుంది. వస్తున్న అవకాశాల వల్ల తమ మ్యారేజ్ ని కూడా వాయిదా వేసుకోవాలని అనుకుంటుందట అమ్మడు. బాలీవుడ్ యాక్టర్ విజయ్ వర్మతో తమన్నా ప్రేమలో పడిన విషయం తెలిసిందే. ఇద్దరు ఇప్పటికే ఈ విషయంపై ఓపెన్ అయ్యారు. తమన్నా ఎక్కడ ఉంటే విజయ్ వర్మ అక్కడ ఉంటున్నాడు. ఇద్దరు కలిసి ఉన్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. రీసెంట్ ఇంటర్వ్యూలో తమన్నాకి పెళ్లెప్పుడు అన్న ప్రశ్న ఎదురైంది. దానికి ఆమె తెలివైన ఆన్సర్ ఇచ్చింది. వివాహ వ్యవస్థ మీద తనకు పూర్తిగా నమ్మకం ఉందన్న తమన్నా ఒకానొక దశలో మ్యారేజ్ చేసుకోవాలని అనుకున్నా సరే ప్రస్తుతం మానసిక స్థితి అలా లేదని.. కెరీర్ చాలా బాగా సాగుతుంది కాబట్టి ప్రస్తుతం దీని మీదే దృష్టి పెడతానని.. పెళ్లి ఆలోచన ఇప్పట్లో లేదని స్పష్టం చేసింది తమన్నా. ఇంకా డిఫరెంట్ సినిమాలు చేయాలని.. షూటింగ్ స్పాటే తన సంతోషాన్ని ఇచ్చే ప్రాంతంగా భావిస్తున్నానని అన్నది తమన్నా. ప్రస్తుతం సీనియర్ హీరోల సరసన కూడా నటిస్తున్న తమన్నా దూకుడు చూస్తుంటే మరో 10 ఏళ్లు ఇదే ఫాం కొనసాగించేలా ఉందని చెప్పొచ్చు. ప్రస్తుతం తమిళంలో అరణ్మనై 4, హిందీలో వేద సినిమాలో నటిస్తుంది తమన్నా.




## షేక్ హ్యాండ్ ఇచ్చుకుని చక్కగా పలకరించుకుని.. ఆ తరువాత ఏమనిపించో ఏమోకానీ..

పాలకుర్తి మండలం వల్మిడి సీతారాముల ఆలయం పున: ప్రతిష్టలో ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. ఇంతకాలం ఉప్పు – నిప్పులా ఉన్న స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ఒకే వేదికపై ఒకరికొకరు తారసపడ్డారు. ఇద్దరూ షేక్ హ్యాండ్ ఇచ్చుకుని చక్కగా పలకరించుకున్నారు. జనగామ : పాలకుర్తి మండలం వల్మిడి సీతారాముల ఆలయం పున: ప్రతిష్టలో ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. ఇంతకాలం ఉప్పు – నిప్పులా ఉన్న స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ఒకే వేదికపై ఒకరికొకరు తారసపడ్డారు. ఇద్దరూ షేక్ హ్యాండ్ ఇచ్చుకుని చక్కగా పలకరించుకున్నారు. ఇద్దరూ కలసి కూర్చోవడంతో సభికులంతా ఆసక్తిగా చూశారు. అది గమనించిన రాజయ్యకు ఏమనిపించిందో ఏమో కానీ మధ్యలోనే సడెన్‌గా అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇటీవలి కాలం లో కడియం, రాజయ్యల మధ్య పెద్ద ఎత్తున విమర్శలు, ప్రతి విమర్శలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో వీరిద్దరూ రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్ అయ్యారు.




హైదరాబాద్: ఎల్బీనగర్‌లోని ఆర్టీసీ కాలనీలో ప్రేమోన్మాది దాడి కేసుకు సంబంధించి పోలీసుల విచారణ కొనసాగుతోంది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. యువకుడి గత నేర చరిత్ర, ఆదివారం నాటి దారుణానికి సంబంధించిన ఆధారాలు సేకరిస్తున్నారు. మరోవైపు నిందితుడి శివకుమార్ దాడిలో తీవ్రంగా గాయపడిన బాధిత యువతి సంఘవిని మెరుగైన వైద్యం కోసం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో మృతి చెందిన ఆమె తమ్ముడు పృథ్వీతేజ్ మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. సంఘవిపై దాడి చేసిన శివకుమార్‌ను కఠినంగా శిక్షించాలని ఆమె సోదరులు శ్రీనివాస్, రోహిత్ డిమాండ్ చేశారు. గతంలో అక్కను శివకుమార్ వేధిస్తున్నాడని తెలిసి హెచ్చరించానని సంఘవి తమ్ముడు రోహిత్ చెప్పాడు. "ఇలాంటి ఘటన మా ఇంట్లో జరుగుతుందని ఊహించలేదు. శివకుమార్ 10వ తరగతి నుంచి మా అక్కను వేధిస్తున్నాడు. ఆదివారం ఘటన జరిగిన తర్వాత బంధువులు, స్నేహితులు ఫోన్ చేయడంతో విషయం తెలుసుకుని ఎల్బీనగర్‌కు వెళ్లాను. గది మొత్తం రక్తపు మరకలతో నిండివుంది. శివకుమార్ వాళ్ల సోదరి కూడా మా అక్కను వేధించినట్లు మా దృష్టికి వచ్చింది. తన తమ్ముడిని పెళ్లి చేసుకోవాలని ఆమె పలుమార్లు కోరినట్లు తెలిసింది. శివను కఠినంగా శిక్షించి మాకు న్యాయం చేయాలి. అతడు బయటకు వస్తే మా అక్కను సైతం చంపే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నాం" అని రోహిత్ అన్నాడు. బాధితురాలి మరో సోదరుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. "పదో తరగతి నుంచి మా చెల్లి సంఘవిని శివకుమార్ వేధిస్తున్నాడు. ఉన్నత చదువులకు ఇబ్బంది ఉంటుందని ఆమె.. ఈ వేధింపుల విషయాన్ని ఇంట్లో మాకెవరికీ చెప్పలేదు. అన్యాయంగా మా తమ్ముడిని చంపేశాడు" అని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రేమిస్తున్నానంటూ వెంటపడి.. కాదన్నందుకు నరరూప రాక్షసుడిగా మారి ఇంట్లోకి చొరబడి యువతిపై కత్తితో దాడి చేయటమే కాకుండా.. అడ్డొచ్చిన ఆమె తమ్ముడిని అతి కిరాతకంగా పొడిచి చంపిన ఘటన హైదరాబాద్ ఎల్బీనగర్‌లో సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడికి సంబంధించి విస్మయకర వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. అడ్డదారుల్లో వెళ్లొద్దని మందలించిన తండ్రిని సైతం.. గతంలో ఇదే యువకుడు దారుణంగా హతమార్చినట్లు ఆరోపణలున్నాయి.




## హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన.. టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేసిన బల్దియా

హైదరాబాద్ మహా నగరంలో ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. అర్ధరాత్రి తర్వాత చినుకులతో మొదలై.. ఉదయం 6 గంటల నుంచి గంటన్నర పాటు దంచి కొట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అమీర్‌పేట, మైత్రీవనం, మయూర్ మార్గ్‌తో పాటు పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై భారీగా వరద నిలిచిపోవడంతో ఉదయం బయటకు వచ్చిన వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే జూబ్లీహిల్స్, ఫిలింనగర్, బంజారాహిల్స్, అమీర్‌పేట్, ఎస్సార్ నగర్, పంజాగుట్ట, ఖైరతాబాద్, ఎర్రగడ్డ, మూసాపేట్, సనత్ నగర్‌లలో బీభత్సంగా వర్షం కురిసింది. పలు భవనాల్లో సెల్లార్లలోకి, నార్సింగ్ మున్సిపాలిటీ బాలాజీనగర్ కాలనీలో పలు ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పందెంవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి.




మాదాపూర్ : హైటెక్ సిటీలో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ బోర్డు తిప్పేసింది. శిక్షణతో పాటు ఉద్యోగం ఇస్తామని నిరుద్యోగుల నుంచి రూ.కోట్లు గుంజిన సదరు సంస్థ నిర్వాహకులు చేతులెత్తేశారు. మాదాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా ప్రొద్దుటూరు ప్రాంతానికి చెందిన బిజినేపల్లి ప్రేమ్‌ప్రకాష్(44) నగరానికి వలస వచ్చాడు. సనత్‌నగర్‌లో నివాసం ఉంటూ స్నేహితుడు లిఖిత్‌తో కలసి ఏడాది క్రితం కొండాపూర్ వెస్టన్ పెరల్ భవనంలో సంటూ సూ ఇన్నోవేషన్స్ పేరిట ఐటీ కంపెనీ ప్రారంభించాడు. తమ కంపెనీలో శిక్షణ అనంతరం ఉద్యోగం కల్పిస్తామని ఒక్కో నిరుద్యోగి వద్ద రూ.లక్ష నుంచి లక్షన్నర వసూలు చేశారు. అలా సొమ్ము చెల్లించి కంపెనీలో చేరిన వారికి రెండు నెలలు జీతాలు ఇచ్చారు. ఆ తర్వాత మాయమాటలు చెబుతూ కాలం గడుపుతున్నారు. కంపెనీ నిర్వాహకుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఉద్యోగులు ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు నిందితులు ప్రేమప్రకాష్, లిఖిత్‌లను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. నిందితులు దాదాపు రూ. 3కోట్లు వసూలు చేసి మోసానికి పాల్పడినట్లు తెలిపారు.

## విష్కృతమవుతున్న పాలమూరు-రంగారెడ్డి.. నీటికోసం తండ్లాడిన నేలల్లో సుజల దృశ్యం సాక్షాత్కారం: మంత్రి కేటీఆర్

హైదరాబాద్: నీటికోసం తండ్లాడిన నేలల్లో సుజల దృశ్యం సాక్షాత్కారమవుతున్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఆవిష్కృతమవుతున్నదని, తెలంగాణ జలవిజయ పతాకం సగర్వంగా ఎగురుతున్నదని చెప్పారు. తెలంగాణ సాగునీటిరంగంలో పీఆర్ఎల్ఐ మరో కాళేశ్వరమని సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. అవాంతరాలను, అడ్డంకులను అధిగమిస్తూ.. కుట్రలను, కేసులను గెలుస్తూ జలసంకల్పంతో అనుమతులు సాధించామన్నారు. దశాబ్దాల కలను సాకారం చేస్తూ పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తవుతున్నదని తెలిపారు. బిరబిరా కృష్ణమ్మ బీళ్లకు నీళ్లందించనున్నదని చెప్పారు. ఇది తెలంగాణ జలశక్తి అని, కేసీఆర్ ప్రభుత్వ చిత్తశుద్ధి అని ట్వీట్ చేశారు.






## పారాచూట్ నాయకులకు టికెట్ ఇవ్వొద్దు.. మధుయాష్కీకి వ్యతిరేకంగా పోస్టర్లు

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీకి వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. గాంధీభవన్ గోడలపై అతికించిన ఈ పోస్టర్లు ఇప్పుడు ఆ పార్టీలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్బీనగర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆయన దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో మధుయాష్కీకి టికెట్ ఇవ్వొద్దంటూ పోస్టర్లు అతికించడం చర్చనీయాంశంగా మారింది. మధుయాష్కీని ఉద్దేశిస్తూ 'గో బ్యాక్ టు నిజామాబాద్.. పారాచూట్ నాయకులకు టికెట్ ఇవ్వొద్దు' అంటూ పోస్టర్లపై పేర్కొన్నారు.

## పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు మోటార్ డ్రై రన్ విజయవంతం





రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల్లో భాగంగా కీలకమైన అడుగు పడింది. నార్లాపూర్ పంప్ హౌస్‌లో సిద్ధమైన మోటారుకు నీటిపారుదల శాఖ అధికారులు విజయవంతంగా డ్రై రన్ పూర్తిచేశారు.

15 రోజుల్లో వెట్ రన్ ను పూర్తిచేసి.... శ్రీశైలం వెనక జలాల నుంచి కృష్ణా జలాలను నార్లాపూర్ జలాశయానికి ఎత్తిపోయనున్నారు. 45 రోజుల్లో కరివేన జలాశయం నీళ్ల నింపేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.

## శ్రీరాంసాగర్, నిజాం సాగర్ ప్రాజెక్టులకు భారీగా వరద

నిజామాబాద్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతోపాటు ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీరాంసాగర్, నిజాం సాగర్ ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో అధికారులు 4 గేట్ల ద్వారా గోదావరి నదిలోకి 12 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా.. ప్రస్తుతం 1090.8 అడుగులకు చేరింది. ఇక నిజాం సాగర్ ప్రాజెక్టులోకి వరద ప్రవాహం పెరిగింది. ప్రాజెక్టులోకి 2500 క్యూసెక్కుల నీరు వస్తున్నది. దీంతో జలాశయంలో నీటిమట్టం 1,403.7 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు. నిజాం సాగర్ గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 17.8 టీఎంసీలు కాగా, ఇప్పుడు 16 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.






శాసనసభ ఎన్నికల్లో పోటీకి కాంగ్రెస్ ఆశావహుల నుంచి వచ్చిన దరఖాస్తుల వడపోత పూర్తవటంతో నేటి నుంచి స్క్రీనింగ్ కమిటీ కార్యాకలాపాలు మొదలవుతాయి. ఇవాళ, రేపు పీఈసీ, డీసీసీ అధ్యక్షులు, పార్టీ సీనియర్లతో ప్రత్యేకంగా సమావేశమై అభిప్రాయాలు సేకరించనుంది. ఎల్లుండి సమావేశం కానున్న స్క్రీనింగ్ కమిటీ పీఈసీ వడపోసి అందించిన జాబితాపై కసరత్తు చేస్తుంది.

## వేములవాడ రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

రాజన్న సిరిసిల్ల : సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి ఆలయం శ్రావణ సోమవారం సందర్భంగా భక్తులతో పోటెత్తింది. ఉదయం నుంచి వర్షం పడుతున్నప్పటికీ భక్తులు క్యూలైన్లలో నిలబడి స్వామివారి దర్శించుకున్నారు. వేకవజామునే భక్తులు పవిత్ర ధర్మ గుండంలో స్థానాలు ఆచరించి రాజన్నకు ప్రీతి మొక్కైన కోడెమొక్కు తీర్చుకున్నారు. ఉదయం నుంచి 11 గంటల వరకు వర్షం కురిసినప్పటికినీ క్యూలైన్లలో బారులు తీరి నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం సందర్భంగా స్వామివారికి అభిషేకం చేసుకునేందుకు ఆలయ అధికారులు 11 గంటల తర్వాత అనుమతించారు. దీంతో భక్తులుఎంతో భక్తిశ్రద్ధలతో స్వామివారికి అభిషేకం మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం ముందు భాగంలో గల కళ్యాణకట్టలో భక్తులు తలనీలాలు సమర్పించుకొని, తామెత్తు బెల్లాన్ని జోకించి భక్తులకు పంచిపెట్టారు.

**కోడె మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు :** ఆలయంలో భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో గండ దీపము మొక్కులు, కుంకుమార్చనలు, కళ్యాణాలు, సత్యనారాయణ వ్రతాలు, చండీ హెూమాలు ఘనంగా నిర్వహించుకున్నారు. రాజన్నను 12 గంటల వరకే సుమారు 35 వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని రాజన్నకు 12 గంటల వరకు సుమారు 18 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. భక్తులు అధికంగా ఉండడంతో ఆలయ అధికారులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

రాజన్న ఆలయ అనుబంధ దేవాలయాలైన శ్రీ భీమేశ్వరాలయం, బద్ది పోచమ్మ, నగేశ్వరాలయాల వద్ద భక్తులు క్యూలైన్లలో నిలబడి స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.

## రాష్ట్రంలో మరో మూడు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు

హైదరాబాద్: అల్పపీడన ప్రభావంతో వచ్చే మూడు రోజులపాటు పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు వర్షాలు కురిసే సూచనలున్నాయని హైదాబాద్ వాతావరణశాఖ తెలిపింది. నేడు, రేపు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, ములుగు, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో భారీ వానలు పడే అవకాశం ఉందని చెప్పింది. మంగళవారం నుంచి బుధవారం వరకు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు అతిభారీ వర్ష సూచన ఉన్నదని వాతావరణ శాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కాగా, సోమవారం ఉదయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా జోరుగా వర్షం కురుస్తున్నది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వీటికితోడు ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తుండటంతో ప్రాజెక్టుల్లో నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, హైదర్‌నగర్, నిజాంపేట, ప్రగతినగర్, మియాపూర్, చందానగర్, లింగంపల్లి, కొండాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, కుత్బుల్లాపూర్, బహదూర్‌పల్లి, సూరారం, సుచిత్ర, జీడిమెట్ల, జగద్గిరిగుట్ట, బాలానగర్ ప్రాంతాల్లో ఉదయం నుంచి వర్షం కురుస్తున్నది. నిజామాబాద్ జిల్లాలో ఎడతెరపిలేకుండా వాన పడుతున్నది. మోపాల్ మండలంలో 15.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఇందల్వాయిలో 14.8, డిచ్‌పల్లిలో 14.2, జక్రాన్‌పల్లి 13.8, సిరికొండలో 13.5 సెంటీమీటర్ల వర్షం కురిసింది. భారీ వర్షాల దృష్ట్యా జిల్లాలోని విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. జుక్కల్–బస్వపూర్ మధ్యలో వంతెన పనులు నిలిచిపోయాయి. ప్రత్యామ్నాయ రోడ్డు కోతకు గురవడంతో వాహనాల రాకపోకలు నిలిచాయి.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com